www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
బుధవారం 27 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 50 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్







## బిహార్ 'ఓట్ల చోరీ' విపక్షాల విమర్శలు..

ప్రజాభిప్రాయం కోరనున్న ఈసీ..!

పోల్‌ప్యానల్ ఐదు ప్రశ్నలు సిద్ధం

2లో...

### తొలి పూజకు సిద్ధమైన

# ఖైరతాబాద్ బడా గణేశ్

## శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్న విఘ్నేశ్వరుడు

**సెల్ఫీలు దిగుతూ సందడి చేసిన భక్తులు - తొలిపూజను నిర్వహించనున్న గవర్నర్**



విశ్వంభర, హైదరాబాద్‌: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్న విఘ్నేశ్వరుడి నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది. అందరూ ఎంతగానో ఎదురుచూసే ఖైరతాబాద్ బడా గణేశుడు 69 అడుగులు ఎత్తు 28వెడల్పుతో భక్తులను ఆశీర్వదించునున్నాడు. 84రోజుల పాటు 125 మంది కళాకారులు ఈ మహానాథుడిని తీర్చిదిద్దారు. లక్షల మంది గణపయ్యను చూడటానికి వస్తుంటారు కాబట్టి ప్రభుత్వం అన్ని భద్రతాపరమైన ఏర్పాట్లు చేసింది. బుధవారం తొలిపూజను గవర్నర్ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

**సెల్ఫీలతో భక్తుల సందడి..**

బుధవారం వినాయక చవితి ఉత్సవాలు మొదలుకానుండగా.. మంగళవారమే భక్తులకు మహాగణపతి దర్శనమిస్తున్నాడు. దీంతో ఆప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడుతోంది. కొందరు భక్తు లు బడా గణేశ్ వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



2లో...

## ఎన్నికల తేదిని ఈసీ కాదు.. బీజేపీనే నిర్ణయిస్తుంది

**ఓట్లు చోరీ చేసి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది**

- మరో 40 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని అమిత్‌షా అన్నారు
- ఎన్ని అక్రమాలు జరిగినప్పటికీ ఈసీపై కేసు నమోదు చేయకుండా చట్టం తీసుకొచ్చారు..?
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ...

# విద్య ద్వారానే ప్రపంచంతో పోటీ పడగలం



2లో...

**- సమాజం అభివృద్ధి చెందుతుంది..**

- సామాజిక మార్పు, వెనుకబాటు తనాన్ని రూపుమాపొచ్చు
- విద్యాసంస్థల మూలంగా ఈ దేశం వేగంగా అభివృద్ధి సాధించింది
- తెలుగు వాళ్ళు ప్రముఖ కంపెనీలకు సీఈఓల స్థాయికి ఎదిగారు..
- మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనే ప్రయోజనం - 100 ఐటీఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం
- రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణానికి జీవో జారీ చేశాం.. - డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## కాంగ్రెస్ మళ్లీ పవర్‌లోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా....

2లో...

- ఆరు గ్యారంటీలపై ఆపార్టీని జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉంది
- తప్పుడు హామీలతో అధికారంలోకి జనాన్ని మోసం చేసింది
- పింఛన్లను పెంచుతామని చెప్పి నమ్మించి నట్టేట ముంచారు
- నిరుద్యోగ భృతి ఊసే లేదు..
- 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు,
- తులం బంగారం, స్కూటీలు ఎక్కడ?
- కేంద్రమంత్రి బండి సంజయ్..

## తెలంగాణ రైతాంగానికి భారీ ఊరట..




2లో...

**8,100 మెట్రిక్ టన్ను యూరియా కేటాయింపు**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం**

## సెప్టెంబరు 7న శ్రీవారి ఆలయం మూసివేత

**చంద్రగ్రహణం కారణంగా అన్ని సేవలు రద్దు**

**8న శ్రీవారి దర్శనానికి భక్తులకు అనుమతి**

**ఓ ప్రకటనలో తెలిపిన టీటీడీ**



2లో...


# కాంగ్రెస్ ఎంపీలు తేలేరు.. బీజేపీ ఎంపీలు అడగరు

- యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలం
- సమస్యలు ఇక్కడ ఉంటే, సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్‌లోనా?
- రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, జాతీయ పార్టీల నిర్లక్ష్యంపై ప్రజలు గమనిస్తున్నారు : కేటీఆర్



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండగా వారి సమస్యలను గాలికొదిలి సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నం అయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రైతుల కష్టాలపై దృష్టి పెట్టకుండా, రాష్ట్ర సమస్యలను పట్టించుకోకుండా జాతీయ రాజకీయాలకు ప్రాధాన్యత ఇవ్వడంపై 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'రైతుబిడ్డలు ఇక్కడ, రాష్ట్ర సీఎం, మంత్రులు ఎక్కడ?' అని నిలదీశారు. సమస్యలు ఇక్కడ ఉంటే, సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్‌లోనా అని నిలదీశారు. రైతులు యూరియా కోసం తండ్లాడుతుంటే, ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడికి ఎగిరిపోతారా అని ప్రశ్నించారు. జాతీయ పార్టీలకు ఓట్లు, రాష్ట్ర ప్రజలకు పాట్లు అంటూ మండిపడ్డారు. యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని పేర్కొన్నారు. యూరియా ఏదయా అంటే కాంగ్రెస్ ఎంపీలు తేలేరు, బీజేపీ ఎంపీలు అడగనే అడగరు అన్నట్లు దుస్థితి దాపురించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, జాతీయ పార్టీల నిర్లక్ష్యంపై ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పంచాయతీ ఎన్నికలు ప్రక్రియ ముమ్మరం




**ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్ విడుదల**

- ఈ నెల 28న పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల
- ఈనెల 28 నుంచి 30 వరకు అభ్యంతరాలను స్వీకరణ
- సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాను విడుదల
- ఈనెల 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

విశ్వంభర, హైదరాబాద్‌: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వంతో పాటు పార్టీలు సన్నద్ధం కావడంతో తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు ప్రక్రియను స్పీడప్ చేసింది. ఎన్నికల నిర్వహణకు ముఖ్యమైన తుది ఓటర్ల జాబితా రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు తెలంగాణ ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు స్టేట్ ఎలక్షన్ కమిషనర్ రాణి కుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 2న ప్రదర్శించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 28న గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 29న జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 30న మండల స్థాయిలో ఎంపీడీవోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 28 నుంచి 30 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటిని పరిశీలించి పరిష్కరించనున్నారు. వచ్చే నెల 2న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నారు.

## ఇసుక ఇబ్బందులు కలుగకుండా చర్యలు

**ఇందిరమ్మ ఇండ్ల కోసం సాండ్ బజార్‌ల ఏర్పాటు.. ప్రభుత్వం లబ్ధిదారునికి రూ.1200లకే టన్ను ఇసుకను అందిస్తుంది**

**ఇండ్లు మంజూరు కానీ లబ్ధిదారులకు కొత్తగా ఇండ్ల మంజూరు చేయిస్తాను**

**- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**

2లో...

## సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం

**క్రమబద్ధీకరణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

స్టే తొలగింపుతో 9లక్షలకుపైగా దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమం

ఈ తీర్పు లక్షలాది మంది పేద ప్రజల కలలను సాకారం చేస్తుంది

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో...

## ఎన్నికల తేదీని ఈసీ కాదు..
# బీజేపీనే నిర్ణయిస్తుంది



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర,నేషనల్ బ్యూరో:** గతంలో జరిగిన ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటి తేదీని ఎన్నికల కమిషన్‌కు బదులు బీజేపీనే నిర్ణయిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ఓట్ల చోరీకి జరుగుతున్న యత్నాలపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా ఎందుకు ఒక్కమాట కూడా మాట్లాడట్లేదని ప్రశ్నించారు. 'ఓటరు అధికార యాత్ర'లో భాగంగా బిహార్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మాట్లాడుతూరాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం మరో 40 ఏళ్లపాటు అధికారంలో ఉంటుందని అమిత్‌షా అన్నారని..ఆ విషయం ఆయనకు ఎలా తెలుసని రాహుల్ ప్రశ్నించారు. ఈ విధంగా ఓట్ల చోరీకి పాల్పడితే ఎన్నేళ్లైనా అధికారంలో ఉండొచ్చని ఎద్దేవా చేశారు. కొన్నేళ్ల క్రితం గుజరాత్ ఎన్నికల్లో మొదలైన ఈ ఓట్ల చోరీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం వరకు వచ్చిందని అన్నారు. ప్రతి రాష్ట్రంలో ఎన్నికలకుముందు కచ్చితంగా ఎన్నికల తేదీలనుమారుస్తారని ఆరోపించారు. వీటిని ఎవరూ ప్రశ్నించకుండా,ఎన్ని అక్రమాలు జరిగినప్పటికీఎన్నికల కమిషన్‌పై కేసు నమోదు చేయకుండా చట్టం తీసుకొచ్చారని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, మణిపుర్ వంటి రాష్ట్రాల్లో ఎక్కడెక్కడ కొత్త ఓటర్లు వచ్చారో అక్కడ భాజపా విజయం సాధించిందని అన్నారు. ఎన్నికల కమిషన్ అధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై ఎప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు. బిహార్ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు ఇండియా కూటమి ఎంత దూరమైనా వెళ్తుందన్నారు. ఆరెస్సెస్ రాజ్యాంగాన్ని ఎప్పుడూ గౌరవించలేదు..అది రాజ్యాంగ విలువలకు వ్యతిరేకమని అన్నారు. ఇప్పుడు మనం ఓటు హక్కును కోల్పోతే.. రాజ్యాంగాన్ని ఎన్నటికీ రక్షించుకోలేమన్నారు.

## బిహార్ 'ఓట్ల చోరీ' విపక్షాల విమర్శలు..
# ప్రజాభిప్రాయం కోరనున్న ఈసీ

**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ సర్కారు ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బిహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బిహార్ ఓటర్లజాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ ఐదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అవి ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా? చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా? రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా? ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజల ఓటు హక్కును తిరస్కరించాలా? ఈ ప్రశ్నల ఆధారంగా బిహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడా నికిఎన్నికలకమిషన్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి




దాదాపు 65లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఈసీ ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసు కున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. గుజరాత్ వ్యక్తులు బిహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్నవారిని చనిపో యినట్లు గా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పే ర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేశాయి. వీటిపై విచారణ చేపట్టిన న్యా యస్థానం ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఈసీకి సూచించింది.

# విద్య ద్వారానే ప్రపంచంతో పోటీ పడగలం : డిప్యూటీ సీఎం



**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది, రాష్ట్రాలు దాటి ప్రపంచంతో పోటీ పడాలంటే కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో ఓ ప్రైవేట్ సంస్థ విద్యారంగంపై రూపొందించిన కాఫీ టేబుల్ ఆవిష్కరణ అనంతరం ఆయన ప్రసంగించారు. సామాజికమార్పు, వెనుకబాటు తనాన్ని రూపుమాపాలన్న, సమ సమాజ స్థాపనకు విద్య ఒక్కటే మార్గం అని డిప్యూటీ సీఎం తెలిపారు. మన పూర్వీకులు పండిట్ జవహర్లాల్ నెహ్రూ మొదలుకొని నేటి వరకు అనేకమంది ప్రధానులు, ముఖ్యమంత్రులు తీసుకువచ్చిన విద్యాసంస్థల మూలంగా ఈ దేశం వేగంగా అభివృద్ధి సాధించింది అన్నారు. ఐఐటి, ఆర్ఈసీ,యుజిసి ఆధ్వర్యంలో పలు యూనివర్సిటీల ఏర్పాటు మూలంగా మన తెలుగు వాళ్ళు ప్రముఖ కంపెనీలకు సీఈఓ ల స్థాయికి ఎదిగారని వివరించారు. వ్యక్తులు స్థాపించిన విద్యాసంస్థలు యూనివర్సిటీల స్థాయికి ఎదిగి అడ్వాన్సుడ్ టెక్నాలజీని బోధించే స్థాయికి చేరాయని తెలిపారు. మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ మారితేనేప్రయోజనం అని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్‌భావించి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం అన్నారు. పరిశ్రమలకు పనికొచ్చేలా సిలబస్ రూపొందించామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన 100 ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, వివిధ పరిశ్రమల అధిపతులు సూచించిన సిలబస్ ను వాటిలో ప్రవేశపెట్టామని తెలిపారు. పేదలకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లు పెట్టుబడితో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 104 యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణానికి జీవో జారీ చేశాం, పాఠాలు బోధించే సిబ్బంది కూడా అక్కడే ఉండేలా వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కోఠి ఉమెన్స్ కాలేజీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి 500 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నామని, ఓయూలో కావలసిన అన్ని వసతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీసీల నియామకం చేశామని తెలిపారు. రాష్ట్రంలో దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్యంపై దృష్టి సారించామన్నారు. రాబోయే 50, వంద సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉంది,ప్రైవేటు విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# తెలంగాణ రైతాంగానికి భారీ ఊరట..

**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ఖరీఫ్ సీజన్ వేళ యూరియా కొరత తీవ్ర సంక్షోభాన్ని సృష్టిస్తోంది. రైతులు పంటలకు కీలకమైన ఈ ఎరువు కోసం గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడుతున్నారు. సరఫరా తక్కువ కావడంతో ధరలు పెరిగి.. బ్లాక్ మార్కెట్లకు తరలివెళ్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల మధ్య ఆరోపణలు, ఆయా జిల్లాల్లో అన్నదాతలు నిరసనలతో రోడ్డెక్కుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో యూరియా కొరతకు కారణం అసమర్థ కాంగ్రెస్ పాలనే కారణమంటూ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాటల తూటలు పేలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరో 4 రాష్ట్రాలకు గాను 30,491 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో బీహార్‌కు




2,700, ఆంధ్రప్రదేశ్‌కు 10,800, తెలంగాణకు 8,100, .ఒడిశాకు 8,891 మెట్రిక్ టన్నుల యూరియా యుద్ధప్రాతిపదికన వెళ్లనుంది. ఈ పరిణామంతో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కాస్త ఉపశమనం లభించనుంది.

# సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర,హైదరాబాద్:** సాదాబైనామాల అంశంపై హైకోర్టు స్టే తొలగించడంతో ఆదరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమమైందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూభారతి చట్టం.. సాదాబైనామాల పరిష్కారానికి దారి చూపిందని, త్వరలో 9 లక్షలకు పైగా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని అన్నారు. హైకోర్టు తీర్పులక్షలాదిమంది పేద ప్రజలకలలను సాకారం చేస్తుందని అభిప్రాయ పడ్డారు. సాదాబైనామాల విషయంలో గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శించారు.

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.. కానీ, పరిష్కారం చూపలేదన్నారు. ఫలితంగా 9.26లక్షల దరఖాస్తులు పరిష్కారం కాకుండా నిలిచిపోయాయని, కొందరు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. సాదాబైనామాల దరఖాస్తుల పరిష్కారానికి ఇప్పటికే గ్రౌండ్ వర్క్ పూర్తి చేసినట్లు మంత్రి పొంగులేటి వివరించారు.

**సాదాబైనామాల క్రమబద్ధీకరణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్**

తెలంగాణలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అడ్డంకి తొలగింది. 2020అక్టోబరు 12 నుంచి నవంబరు 10 వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020 అక్టోబరు 10న రాష్ట్ర ప్రభుత్వం జీవోవిడుదల చేసింది. ఈజీవోపై 2020 నవంబరులో ఉన్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. చట్టంలో అవకాశం లేకుండా ఎలా క్రమబద్ధీకరిస్తారని ప్రశ్నించింది. కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ అంశం పొందుపరిచినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వ వివరణతో సంతృప్తి చెందిన ధర్మాసనం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అంగీకరిస్తూ కేసు విచారణను ముగించింది.

# సెప్టెంబరు 7న శ్రీవారి ఆలయం మూసివేత




**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర,తిరుమల:** చంద్ర గ్రహణంకారణంగా సెప్టెంబరు 7న దాదాపు 12 గంటల పాటు శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబరు7న రాత్రి 9.50 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై.. అర్ధరాత్రి 1.31 గంటలకు ముగుస్తుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబరు 8న ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో ఆలయ తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు. 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.చంద్రగ్రహణం కారణంగా వచ్చే నెల 7న(ఆదివారం) ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది. అదే రోజు సాయంత్రం 3 గంటల నుంచి తిరుమలలో అన్నప్రసాద వితరణ ఉండదు. సెప్టెంబరు 8న ఉదయం 8.30 గంటలకు అన్నప్రసాదాల పంపిణీ పునః ప్రారంభించనున్నట్లు టీటీడీ తెలిపింది.

భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో 30వేల పులిహోర ప్యాకెట్లను సెప్టెంబరు 7న సాయంత్రం నుంచి పంపిణీ చేయన్నట్టు అధికారులు తెలిపారు. శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న వైభోత్సవ మండపం, రామ్ భగీచా, పీఏసీ-1, సీఆర్వో, ఏఎన్సీ ప్రాంతాల్లోని ఫుడ్ కౌంటర్లు, శ్రీవారి సేవా సదన్ వద్ద భక్తులకు అన్నప్రసాదం ప్యాకెట్ల అందించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీవారి భక్తులు ఈ విషయాలను గమనించి తిరుమల యాత్ర ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులు సూచించారు.

# ఇసుక ఇబ్బందులు కలుగకుండా చర్యలు

**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, ఆందోల్: ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుక ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు, వారికి చేయూతనివ్వాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం సాండ్ బజార్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోలు%-%జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని సాండ్ బజార్‌ను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. సాండ్ బజార్ నిర్వహకులు, అధికారులు మంత్రికి ఘన స్వాగతం పలుకగా, వేబ్రిడ్జి, ఇసుక క్వారీని రిబ్బన్ కట్ చేసి, పచ్చజెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

జిల్లాలోనే ప్రప్రథమంగా అందోలు నియోజకవర్గంలో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరిగిందని, మున్సిపాలిటీ పరిధిలో 125 ఇండ్లు మంజూరు కాగా, వీటిలో 112 ఇండ్లు ప్రారంభమై, బెస్మెట్ లేవల్ వరకు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. బిల్లుల చెల్లింపు విషయంలో జాప్యం లేదని, సకాలంలో అందిస్తున్నామన్నారు. ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నులను అందిస్తున్నామని,

దీని వలన సుమారుగా లబ్దిదారునికి రూ.50 వేల వరకు ఆదా అవుతుందన్నారు. బయట మార్కెట్‌లో ఇసుక టన్ను ధర రూ.2,600 వరకు ఉందని, ప్రభుత్వం లబ్దిదారునికి రూ.1200 ల కే టన్ను ఇసుకను అందిస్తుందని, లబ్దిదారుడు సాండ్ బజార్ వద్దకు వచ్చి తీసుకేళ్లాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఇండ్లు మంజూరు కానీ లబ్దిదారులకు కొత్తగా ఇండ్ల మంజూరు చేయిస్తానని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసానిచ్చారు. సామాన్యుల సొంతింటి కలను నేరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంజూరైన లబ్దిదారులు ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సూచించారు.

సాండ్ బజార్‌లోని ఇసుకను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబు, ఇంచార్జీ ఆర్‌డీవో రవీందర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫేడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జీఆర్.నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ హనుమండ్లు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య, మున్సిపల్ కమిషనర్ రవీందర్, తహశీల్దార్ మదుకర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్‌లు రాములు, డేవిడ్, మాజీ కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్ గౌడ్, రంగ సురేష్, డి.శంకర్. పీ.ప్రవీణ్‌కుమార్, దుర్గేష్, చందర్, హరికృష్ణాగౌడ్, ప్రదీప్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీటీసీలు డీజీ.వెంకటేశం, రాజీరెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మళ్లీ పవర్‌లోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తా..

**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, కరీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే..తాను రాజకీయ సన్యాసం చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో 8మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మంగళవారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడుతూ..

ఆరు గ్యారంటీలపై ప్రజలు కాంగ్రెస్ నేతలను జనం రాళ్లతో కొట్టే పరిస్థితి ఉందని కామెంట్ చేశారు. తప్పుడు హామీలతో అధికారంలోకి జనాన్ని మోసం చేసింది కాంగ్రెస్ పార్టీనే అని ఫైర్ అయ్యారు. మహిళలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మొహం చాటేశారని ఆరోపించారు. పింఛన్లను పెంచుతామని చెప్పి నమ్మించి నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు ఎక్కడ రేవంత్ రెడ్డి అని బండి సంజయ్ ప్రశ్నించారు.

**గజినీ మూవీ గుర్తుకొస్తుంది..**

అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా.. గ్రామ పంచాయతీయలకు నయా పైసా ఇవ్వని ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని బండి సంజయ్ అన్నారు. దొంగ ఓట్లపై మాట్లాడుతున్న కాంగ్రెస్ లీడర్లు.. జగిత్యాలలో సీట్ల చోరీ గురించి మాట్లాడాలని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను పదవి నుంచి దిగిపోయినప్పుడు ఇదే మహేశ్ కుమార్ గౌడ్ ఓ బీసీగా స్పందించానని అన్నాడని.. నేడు అదే వ్యక్తి తాను బీసీ కాదని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. పీసీసీ చీఫ్‌ను చూస్తే తనకు గజినీ మూవీ గుర్తుకొస్తుందని సెటైర్లు వేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని మహేశ్ కుమార్ గౌడ్, దొంగ ఓట్లు అంటూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను అవమానించారని కామెంట్ చేశారు.

అదేవిధంగా 8 నియోజవర్గ ప్రజలకు కూడా క్షమపణలు చెప్పాలన్నారు. ఒకవేళ కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. ఇక కరీంనగర్‌లో ఒక్కో మైనారిటీ ఇంట్లో 200 ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వమంటే.. ముస్లింకు రిజర్వేషన్లు ఇవ్వడంఏంటని మండిపడ్డారు. ఉప రాష్ట్రపతిగా ఓబీసీని నిలబెడితే.. ఒడగొట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని అన్నారు. ఓడిపోయే దగ్గర రెడ్డిని నిలబెడతారా అని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ సీట్లను గెలిస్తే.. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎలా అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఓటు చోరీ చేసినట్లైతే తెలంగాణలోనూ మేమే అధికారంలో రావాలి కాదా.. అని బండి సంజయ్ కామెంట్ చేశారు.




**టోపీలు పెట్టుకుని కాంగ్రెస్ నేతల డ్రామాలు..**

ఎన్నికలు ఉన్నా.. లేకపోయినా హిందూ ధర్మం కోసం నిలబడతామని బండి సంజయ్ అన్నారు. సనాతన ధర్మం కోసం బీజేపీ పోరాటం చేస్తోందని తెలిపారు. భైంసాలో పేద హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు ఈ కాంగ్రెస్ నేతలు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. మాది దేవుళ్లపార్టీ.. మీదిబిచ్చపు బతుకు అంటూ ఫైర్ అయ్యారు. హిందువుల పండుగలకు గుళ్లలో సౌండ్ పెట్టొద్దని చెప్పడం దుర్మార్గమని అన్నారు. యూపీఏ హయాంలోనే దేశంలోకి పెద్ద ఎత్తున రోహింగ్యాలు వచ్చారని, టోపీలు పెట్టుకుని డ్రామాలు చేసేది కాంగ్రెస్ నేతలు కాదా అని బండి సంజయ్ మండిపడ్డారు.

## బీజేపీ నేతకు కానుకగా ఫుట్‌బాల్..

### ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న నిరసన



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా

### మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే దైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. "పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా. మీరెందుకు 8 ఎంపీ స్థానాలు గెలుస్తారు?అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. బీజేపీను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?" అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.

## ఆకట్టుకుంటున్న 'ఆపరేషన్ సిందూర్' గణేశుడు



విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్‌లోని పాతబస్తీ లలిత బాగ్ డివిజన్‌లో 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. మల్లికార్జునస్వామినగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఈ గణపతి ప్రతిమను నిలిపారు. వైమానిక అధికారి వేషధారణలో ఉన్న గణనాథుడి విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు రూ.10 లక్షల ఖర్చుతో ఈ విధంగా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



బీహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో ఏఐసీసీ అగ్రనాయకులు ప్రియాంక గాంధీని మర్యాద పూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్,సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ఇతర ముఖ్య నేతలు..

## దేశ రాజకీయాల్లో ట్రెండ్ సెట్టర్

# డైనమిక్ లీడర్ రేవంత్ రెడ్డి

### తెలంగాణ బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్



విశ్వంభర, హైదరాబాద్ : భారత ఉపరాష్ట్రపతి పదవి ఒక రాజ్యాంగ బద్ధమైన ఉన్నతమైన స్థానం తాజా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున జస్టిస్ బీ.సుదర్శన్ రెడ్డి( సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి) నీ అభ్యర్థిగా ప్రకటించడంలో రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని అంతేకాకుండా దేశ రాజకీయాల్లో ట్రెండ్ సెట్టర్ గా నిలిచారని తెలంగాణ స్టేట్ బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, తెలంగాణ రాష్ట్రం దేశ రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేశ రాజకీయ డైనామిక్స్ మార్పులకు, చర్చకు, కేంద్రం బిందువుగా ఉండడం దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్న నాయకత్వం తెలంగాణ గడ్డ నుంచి పరివర్తన చెందుతుంది అనడం ఆహ్వానించదగ్గ పరిణామం అని అన్నారు.న్యాయానికి న్యాయం జరగాలంటే జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణకు చెందినవారు కావడం ఆయన న్యాయపరమైన, నిష్పక్షపాతమైన సామాజిక న్యాయం పట్ల ఆయన ఆలోచనలు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రతిబింబిస్తున్నాయని తెలంగాణలో కుల గణన ( కుల సర్వే) చేపట్టడం ద్వారా రేవంత్ రెడ్డి దేశ రాజకీయాలలో ఒక కొత్త ట్రెండును సృష్టించారని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేంద్రంలో ఉన్నప్పటికీ రాష్ట్రస్థాయిలో ఇలాంటి సర్వేలు చేపట్టడం ద్వారా రేవంత్ రెడ్డి ఒక సామాజిక విప్లవానికి నాంది పలికారని అభినందనలు తెలిపారు. రేవంత్ రెడ్డి ఆలోచన దేశవ్యాప్త కులగణనకు డిమాండ్ పెంచిందని, రాహుల్ గాంధీతో సహా కాంగ్రెస్ నాయకులు ఈ అంశాన్ని జాతీయ ఎజెండాగా తీసుకొని ముందుకు తీసుకు వెళుతున్నారని రేవంత్ రెడ్డి వ్యూహాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక శక్తివంతమైన నాయకుడని ఆయన సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, పాలనలో సంస్కరణలు వంటి అంశాలతో జాతీయస్థాయిలో కాంగ్రెస్ కు బూస్ట్ ను ఇచ్చారని రేవంత్ రెడ్డి కూడా ఇలాంటి నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగుతున్నారని వైయస్ తన పాలనలో ఆరోగ్యశ్రీ, రైతు సంక్షేమ పథకాల ద్వారా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, అదే విధంగా రేవంత్ రెడ్డి తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కుల గణన, వంటి కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరవుతున్నారని ఈ ఇద్దరు నాయకుల్లోనూ ఉన్న ఒక సామాన్య లక్షణం ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను పరిష్కరించే చొరవ, వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ లోఅజేయ శక్తిగా నిలిపారని అదే స్ఫూర్తితో నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో కాంగ్రెస్ ను బలోపేతం చేస్తూ జాతీయ రాజకీయాలలో పార్టీకి దిశా నిర్దేశం చేస్తున్నారని అన్నారు.

**బి.సుదర్శన్ రెడ్డి ఎన్నిక అమోఘం..**

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రదర్శన లో రేవంత్ రెడ్డి వ్యూహాలు మెరుగు పడుతున్నాయి అనడంలో అతిశయోక్తం లేదని నూతి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.

# గాంధీ కుటుంబమే నాకు దైవం

### ఆర్ఎస్ఎస్ గీతం వివాదంపై డీకే శివకుమార్



విశ్వంభర, బెంగళూరు: కర్ణాటకలో ఒకవైపు 'సీఎం మార్పు' అంశంపై ఊహాగానాలు వినిపిస్తుండగా.. మరోపక్క ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే . దాంతో కాంగ్రెస్ నేతలంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై తాజాగా డీకే స్పందించారు. "బీజేపీని విమర్శించేందుకే నేను ఆ పాట పాడాను. కానీ కొందరు దీనిద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే.. అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదు" అని డీకే వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం , కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. "నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా.. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని" అని స్పష్టం చేశారు.ఇటీవల చిన్నస్వామి క్రీడా మైదానంలో తొక్కిసలాట అంశంపై బదులిస్తున్న సందర్భంగా డీకే శివకుమార్ ఆర్ఎస్ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం సభను కాసేపు ఆలోచనలో పడేసింది. తనపై విపక్ష సభ్యులు చేస్తున్న ఆరోపణలు సహేతుకంగా లేవని, భాజపా పాలిత రాష్ట్రాల్లో సంభవించిన తొక్కిసలాట ఘటన వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఈ సందర్భంగానే 'నమస్తే సదా వత్సలే మాతృభూమే' అంటూ ఆ సంస్థ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతిచ్చారు. సభ రికార్డుల నుంచి ఈ గీతాన్ని తొలగించరాదంటూ వారు నినదించారు.డీకే శివకుమార్ ఇలా వ్యవహరించడం ఇదే తొలిసారి కాదు . గతంలో అమిత్ షాతో కలిసి సమావేశంలో పాల్గొనడం, కుంభమేళాలో పుణ్య స్నానం, ఇటీవల ప్రధాని మోదీతో దిల్లీలో భేటీ, యడియూరప్పతో తరచూ మంతనాలు, తాజాగా ఆర్ఎస్ఎస్ గీతం పాడటం అధిష్ఠానానికి ప్రత్యేకంగా సంకేతాలు పంపడం కిందికే వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చినప్పుడు, తనపై పార్టీలో వ్యతిరేకత పెరిగినప్పుడు భాజపాతో సఖ్యతగా ఉన్నట్లు సందేశాలు పంపుతుంటారు. తనకు భాజపా నుంచి మంచి అవకాశాలున్నాయన్నట్లు తమ పార్టీకి తెలియజేయటమే లక్ష్యమని పలువురు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

# భవిష్యత్తులో యుద్ధాలకు ఆ నాలుగే కారణాలు: అనిల్ చౌహాన్




విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రపంచదేశాల మధ్య నెలకొంటున్న ఉద్రిక్తతలపై చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఎప్పటికీ శాంతి, సుస్థిరత, భద్రతకు కట్టుబడి ఉంటుందని.. అయితే దానిని ఆసరాగా చేసుకొని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. గతంలో జరిగే యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు చాలా వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. గతంలో వ్యతిరేక భావజాలం, భూభాగాల స్వాధీనం చేసుకొనేందుకు చేసే యుద్ధాలు అందరి కళ్లకు కనిపించేవని.. ప్రస్తుతం కొత్తకొత్త వ్యూహాలతో దేశాలు పరస్పరం యుద్ధ వాతావరణాన్ని సృష్టించుకుంటున్నాయన్నారు.

భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలకు నాలుగు కారణాలు ఉంటాయని అనిల్ చౌహాన్ పేర్కొన్నారు.

1. వారి వారి రాజకీయ లక్ష్యాలను చేరుకోవడం కోసం ఆయా దేశాలు పరస్పరం బల ప్రయోగానికి దిగడం
2. పోటీ, సంక్షోభం, ఘర్షణ వంటి విషయాల్లో శాంతికి, యుద్ధానికి మధ్య సరైన తేడా తెలుసుకోలేకపోవడం
3. ప్రజల అవసరాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం
4. విజయాన్ని నిర్ణయించే కొలమానాల్లో వస్తున్న మార్పులు

ఇలాంటి వాటివల్లే భవిష్యత్తులో దేశాల మధ్య యుద్ధాలు వచ్చే అవకాశం ఉందన్నారు. 1971లో పాక్‌తో జరిగిన ఘర్షణల్లో భారత్ 95 వేల మంది పాకిస్థానీయులను బంధించిందని.. కానీ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ లో ఆయుధాల రేంజ్, దాడుల ప్రభావాలను కొలమానంగా తీసుకున్నామని అనిల్ చౌహాన్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న పాఠాలతో ఆధునిక ఘర్షణలను ఎదుర్కోవడానికి భారత్ సమాయత్తమవుతుందని అనిల్ చౌహాన్ తెలిపారు. ఇందుకోసం త్రివిధ దళాలు కలిసి పనిచేస్తున్నాయన్నారు. మనపై దాడి చేస్తే దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అప్పుడే అయిపోలేదని, ఎప్పటికీ కొనసాగుతుందన్నారు. రక్షణ వ్యవస్థలను, ఆయుధశక్తిని మరింత బలవంతం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత్ అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడాలంటే 'శశాస్త్ర'.. 'సురక్షిత'..'ఆత్మనిర్భర్'గా మారడం ఎంత అవసరమో ప్రజల సైద్ధాంతికపరమైన ఆలోచనలు.. కార్యాచరణల్లోనూ మార్పు తీసుకురావడం అంతే అవసరమని సీడీఎస్ సూచించారు. అప్పుడే భవిష్యత్తులో ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లను వేగంగా, నిర్ణయాత్మకంగా ఎదుర్కోగలమని అన్నారు.



బీహార్ రాష్ట్రం సుపాల్‌లో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలతో కలిసి ఓటర్ అధికార్ యాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

## ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీలు..

### స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ఇటీవల 2025-26 విద్యా సంవత్సరానికి మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినా దాదాపు 48వేలకు పైగా సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్స్‌లో 48,630 సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. అత్యధికంగా ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 13,256 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 12,668 సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరో తరగతికి సంబంధించి 7,543 సీట్లు, ఏడో తరగతిలో 5,192 సీట్లు, 8వ తరగతి 3,936 సీట్లు, 9వ తరగతి 2,884 సీట్లు, పదో తరగతిలో 3,151 సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మోడల్ స్కూల్స్‌లో సీట్లు కావాలనుకునే వారు నేరుగా పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపల్‌ను కలవాలని సూచించారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ




విశ్వంభర, హైదరాబాద్ : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సమాచార పౌరసంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్.ప్రియాంక సూచించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో సుమారు 150 మట్టి వినాయక విగ్రహాలను జర్నలిస్టు సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి నష్టం జరగకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవిత హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు డిఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు కె. వెంకటరమణ, సమాచారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ ఆస్పత్రిలో ఆడ పిల్ల జన్మిస్తే ఎలాంటి రుసుములుండవు..

### ప్రశంసించిన ఆనంద్ మహీంద్రా

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ఇటీవల డాక్టర్ గణేశ్ రాఖ్ చేస్తోన్న సేవలను ప్రశంసిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. పుణెకు చెందిన ఆ వైద్యుడు కొన్ని సంవత్సరాలుగా తమ ఆసుపత్రిలో ఆడపిల్ల జన్మిస్తే వారి నుంచి ఎలాంటి ప్రసవ రుసుమును తీసుకోవడం లేదని తెలిసి నెటిజన్లు కూడా అభినందిస్తున్నారు. ఈ వైద్యుడి గురించి ఐఏఎస్ అధికారి డి. ప్రశాంత్ నాయర్ సోషల్ మీడియాలో షేర్ చేయగా.. ఆనంద్ మహీంద్రా రీ పోస్ట్‌చేశారు. ఆ పోస్టులో వివరాల ప్రకారం.. ఓ దినసరి కూలీ తన భార్యను ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. తన భార్యకి సిజేరియన్ చేయాలనడంతో వైద్య ఖర్చుల కోసం తన ఇల్లు తాకట్టు పెట్టాలనుకున్నాడు. కాన్పు తర్వాత ఆత్రుతగా వైద్యుడిని ఎవరు పుట్టారని అడిగాడు. నీకు మహాలక్ష్మి పుట్టిందని వైద్యుడు చెప్పాడు. పాప తండ్రి సంకోచిస్తూ.. ఆస్పత్రి రుసుము గురించి ఆరాతీశాడు. " మహాలక్ష్మిలాంటి అమ్మాయి పుట్టింది. బాలికలు ఈ ఆసుపత్రిలో జన్మిస్తే ఎలాంటి రుసుము తీసుకోను" అని వైద్యుడు అన్నారు. దాంతో వైద్యునికి ఆ వ్యక్తి కృతజ్ఞతలు తెలిపాడు." ఇద్దరు కుమార్తెలకు తండ్రిగా ఇంట్లో మహాలక్ష్మి జన్మిస్తే ఎలా ఉంటుందో నాకు తెలుసు. ఆ ఆనందాన్ని వర్ణించలేం. ఉచితంగా ప్రసవాలు చేయడం ఆయన దాతృత్వానికి నిదర్శనం" అని పోస్టులో ఆనంద్ మహీంద్రా రాసుకొచ్చారు. ఇక ఆ ఆస్పత్రి విషయానికి వస్తే.. ఆస్పత్రిని 2007లో ప్రారంభించారు. అప్పటి నుంచి ' ఆడపిల్లలను కాపాడాలి' అన్న నినాదంతో ఇప్పటివరకు దాదాపు 1000కిపైగా కాన్పులను ఆ వైద్యుడు ఉచితంగా చేసినట్లు తెలుస్తోంది.ఆడ పిల్ల జన్మిస్తే కాన్పు ఖర్చులను తీసుకోకపోవడం సమాజానికి అమ్మాయిలు ఎంత విలువైన వారో తెలియజేస్తోందని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. ఇలాంటి వారికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని పలువురు సూచించారు. డాక్టర్ చేస్తోన్న సేవలను కొనియాడారు.



# ప్రకృతి ప్రేమికుడు పార్వతీ పుత్రుడు



వినాయక చవితి నాడు విఘ్నేశ్వరుని ఏక వింశతి (21 రకాల) పత్రులతో అనగా ఆకులతో పూజించేవారు. పూర్వం ఈ పత్రులన్నీ పొలాల గట్ల మీద తోటల వెంట వెళ్లి ఏరి తెచ్చుకునే వారు. ఏవైనా దొరకని వాటికి ప్రత్యామ్నాయంగా గరికతో గణపతిని పూజించేవారు. ఇక దేవదారు వంటి కొన్ని రకాల పత్రులు మన ప్రాంతంలో లభ్యం కావు. అటువంటి పత్రులను ప్రత్యేకంగా సేకరించే అలవాటు కూడా గణపతి భక్తులకు ఉండేది. వినాయకుని పత్రి పూజలో దాగిన అనేక ఆరోగ్య రహస్యాలు ఉన్నాయని ఆయుర్వేదం తెలుపుతుంది. ఆ విషయాలను ఈ వ్యాసంలో తెలుసుకుందాం!

పార్వతీ పుత్రుడైన గణేశుడు ప్రకృతి ప్రేమికుడని ఒక ప్రతీతి. ఆయన ప్రకృతికి అధినాయకుడు కూడా. వ్యవసాయపు పనులు ముమ్మరంగా ఉండే వర్షాకాలంలో వినాయక చవితి పండుగ వస్తుంది. వినాయకుని ఏకదంతం నాగలికి సంకేతంగా భావిస్తారు. ఆయన లంబోదరం ధాన్యపు గాదెను సూచిస్తుంది. కడుపు చుట్టూ ఉన్న నాగబంధం పంటల్ని పాడు చేసే ఎలుకల్ని నాశనం చేస్తుందంటారు. ఇలా వినాయక రూపానికి, వ్యవసాయానికి ఉన్న అనుబంధం గురించిన భావనలు అపారంగా ఉన్నాయి. ముఖ్యంగా వినాయక చవితిలో 21 రకాల పత్రులను సేకరించడం కోసం చిన్న పెద్ద తోటల వెంట, పొలాల గట్ల వెంట వెళ్లేవారు. ఆ ఔషధ గుణాలు కలిగిన చెట్లపై ఎక్కి ఆకులు తెంచుకురావడం కూడా ఆరోగ్యాన్ని వృద్ధి చేసే అలవాటే అవుతుంది. తర్వాత చెరువులలోని బంక మట్టిని వినాయకుడి బొమ్మ కోసం సేకరిస్తారు. ఊరంతా ఒక్కసారిగా చెరువులోని మట్టిని తీయడం వల్ల పూడిక తొలగిపోతుంది. అటుపైన మట్టి గణపతిని తయారు చేసుకొని పాలవెల్లిని కట్టి 21 రకాల పాత్రులతో పూజిస్తారు. 9 రోజులపాటు అక్షతలు, పసుపు, కుంకుమ వగైరాలతో పాటు, మాగిన ఆకులు ఆనాడు చెరువుల్లో నీటిని శుద్ధి చేసేవి. ఆకులలోని ఔషధీ గుణాలు నీళ్లలోని కాలుష్యాన్ని వ్యాధికారక క్రిములను తొలగించేవి.

మట్టి వినాయకుల విగ్రహాలని పూజిద్దాం..!

వృత్తికా రూపంలో అర్చన సర్వ శ్రేష్టమైనది. మృత్తిక అనగా మట్టి. వాతావరణ కాలుష్యాన్ని నీటి కాలుష్యాన్ని నివారించేందుకు గాను వినాయక పూజలో పూర్తిగా మట్టి వినాయక ప్రతిమలనే వినియోగిద్దాం! మృత్తిక అంటే మట్టి రూపంలోనే వినాయకుని పూజిద్దాం! ఏ దేవతా ప్రతిమనైనా తయారుచేసిన తర్వాత శీఘ్రంగా పూజించాలి. వినాయక చవితి నాటి ఉదయాన్నే మట్టి వినాయకుడిని తయారు చేసుకోవడం మన సనాతన ఆచారం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీలో విద్యుత్, ఇంధనం విరివిగా ఉపయోగిస్తారు. దీని వల్ల భూతాపం పెరిగిపోతుంది. మట్టితో కాకుండా ఇతర పదార్థాలతో చేసిన విగ్రహాలు నీటిలో సులభంగా కరిగిపోవు. దీనివల్ల నిమజ్జనంలోని ముఖ్య ఉద్దేశం నెరవేరదు. అందువల్ల మనం చేసిన పూజంతా కూడా వృధా అవుతుంది. ఇదే కాకుండా విగ్రహారాధన అంటే నమ్మకం లేని వాళ్ళ వద్ద విగ్రహాలు కొనడం కూడా సనాతన ధర్మానికి విరుద్ధమే అవుతుంది. కనుక విగ్రహారాధనను విశ్వసించే వారి వద్దనే విగ్రహాలను కొందాం! అంతేకాక మట్టి విగ్రహాలనే కొని పూజించడం వలన మన కోరికలు తీరడమే కాక ప్రకృతిని రక్షించిన వాళ్ళం అవుతాం! ఈ విషయాన్ని గణపతి భక్తులమైన మనమంతా గమనిద్దాం!

ఏక వింశతి (21) పత్రులలో దాగిన ఆరోగ్య రహస్యాలు

వినాయకుని ఏకవింశతి (21) పత్రులతో పూజిస్తారు కదా! 21 పత్రులతో అంటే ఆకులతో విఘ్నేశ్వరుడికి పూజ చేస్తారు.

ఈ ఆకు పూజ అందులోనూ 21 ఆకులతో వినాయకుడికి పూజ చేయడమేమిటి? అనే సందేహం కలుగుతుంది. ఆ సందేహానికి సమాధానంగా మన పురాణాల్లో అనేక చోట్ల వివరణలు కనిపిస్తాయి. ముఖ్యంగా అధర్వణ వేదంలో అంతర్భాగమైన ఆయుర్వేద శాస్త్రం వినాయకుడికి సమర్పించే 21 రకాల ఆకులలోను అద్భుత ఔషధ గుణాలు ఉన్నాయని చెబుతుంది. ఇలాంటి ఔషధ లక్షణాలున్న ఆకును చిన్ననాటి నుంచే పిల్లలకు వినాయకుని పూజ పేరుతో పరిచయం చేస్తే వారి జీవితాలకు ఎంతో మేలు కలుగుతుందని మన పెద్దలు భావించేవారు. ఈ 21 రకాల ఆకులలో దాగిన ఔషధ గుణాలను ఇప్పుడు తెలుసుకుందాం!

ఏక వింశతి (21) పత్రులు ఇవే:

1) మాచి పత్రం, 2) బృహతీ పత్రం, 3) బిల్వ పత్రం, 4) దుర్వాయుగ్మ పత్రం, 5) దత్తూర పత్రం, 6) బదరీ పత్రం, 7) అపామార్గ పత్రం, 8) తులసి పత్రం, 9) చూత పత్రం, 10) కరవీర పత్రం, 11) విష్ణు క్రాంత పత్రం, 12) దాడిమీ పత్రం, 13) దేవదారు పత్రం, 14) మరువక పత్రం, 15) సింధు వార పత్రం, 16) జాజి పత్రం, 17) శమీ పత్రం 18) అశ్వత్థ పత్రం, 19)అర్జున పత్రం, 20) అర్క పత్రం, 21) గండకీ పత్రం,

1) మాచి పత్రం: తెలుగులో కూడా మాచీ పత్రమనే అంటారు. ఇది నేత్రవ్యాధులను,చర్మవ్యాధులను పోగొడుతుంది.

2) బృహతీ పత్రం: దీనిని నేల మునగ వాకుడు ఆకు అంటారు. ఇది మూలశంక, దగ్గు, మలబద్ధకము నివారిస్తుంది.

3) బిల్వ పత్రం: దీనినే మారేడు అంటారు ఇది చక్కెర వ్యాధిని ఎంతో నివారిస్తుంది.

4) దూర్వాయుగ్మ పత్రం: దీనినే జంటగరిక అంటారు. ఇది మూత్ర సంబంధమైన వ్యాధులను తొలగిస్తుంది.

5) దత్తూర పత్రం: దీనినే ఉమ్మెత్త ఆకు అంటారు. ఇది మానసిక రోగాల నుండి రక్షిస్తుంది.

6) బదరీ పత్రం: దీనినే రేగు ఆకు అంటారు. ఇది పిల్లలకు సంబంధించిన రోగాలను పోగొడుతుంది.

7) అపామార్గ పత్రం: దీనినే ఉత్తరేణి ఆకు అంటారు. ఇది దంత వ్యాధులను చర్మ రోగాలను ఇట్టే పోగొడుతుంది.

8) తులసి పత్రం: దీనిని తులసి ఆకు అంటాం. ఇది దగ్గు, వాంతులు, నులిపురుగులు, జలుబు మొదలైన వ్యాధులను తొలగిస్తుంది.

9) చూత పత్రం: దీనిని మామిడి ఆకు అంటారు. ఇది చర్మ రోగాల నుండి కాళ్ళ పగుళ్ళ నుండి అతిసారా వ్యాధి నుండి రక్షిస్తుంది.

10) కరవీర పత్రం: దీనికే గన్నేరు ఆకు అని మరో పేరు. ఇది జ్వర తీవ్రతను నివారిస్తుంది.

11) విష్ణు క్రాంత పత్రం: దీనినే అవిసె ఆకు అంటారు ఇది తామర రక్తదోషం లాంటి వ్యాధులను పోగొడుతుంది

12) దాడిమీ పత్రం: దీనికి దానిమ్మ అని పేరు. ఇది దగ్గు, ఉబ్బసం, అజీర్ణం కళ్ళ వాపు రోగాలను తొలగిస్తుంది.

13) దేవదారు పత్రం: తెలుగులో కూడా దీన్ని దేవదారు గానీ పిలుస్తారు. ఇది శ్వాస కోశ సంబంధమైన వ్యాధులను నివారింప చేస్తుంది.

14) మరువక పత్రం: దీనినే మరువం అంటాం. దీనిని ముఖ్యంగా మహిళలు పూలలో సువాసన కొరకు అల్లుకుంటారు. దీనికి మరువం అని తెలుగులో పేరు. ఇది శరీర దుర్వాసనను పోగొట్టి సువాసనను కలిగిస్తుంది.

15) సింధు వార పత్రం: దీనికి వావిలి ఆకు అని పేరు. ఇది బాలింతల వాత రోగం వంటి నొప్పులు దూరం చేస్తుంది.

16) జాజి పత్రం: తెలుగులో కూడా జాజి ఆకు అని పిలుస్తారు. ఇది నోటి దుర్వాసన పోగొడుతుంది.

17) శమీ పత్రం: తెలుగులో దీనినే జమ్మి ఆకు అంటారు. ఇది దసరా పండుగ రోజున పూజించి పరస్పరం 'బంగారం' అనే పేరుతో ఇచ్చిపుచ్చుకునే ఆచారం ఉంది. ఈ జమ్మికి మహాభారతం, రామాయణం సంబంధించిన అనేక సందర్భాలు ఉన్నాయి. ఇది కుష్టు వ్యాధి నుండి కాపాడటమే కాక అవాంచిత రోమాలను తొలగించి చర్మాన్ని మెరుగుపరుస్తుంది.

18) అశ్వత్థ పత్రం: దీనికే రావి ఆకు అని పేరు. ఇది శ్వాసకోశ సంబంధమైనటువంటి వ్యాధులను నివారిస్తుంది.

19) అర్జున పత్రం: దీనికే మద్ది ఆకు అని పేరు ఇది దీర్ఘం కాలం నుండి బాధిస్తున్న గాయాలను నివారిస్తుంది.

20) అర్క పత్రం: దీనికే జిల్లేడు ఆకని పేరు. ఇది సూర్య సంబంధమైనటువంటి పత్రము. ఇది ముఖము యొక్క రంగును మార్చి ఆకర్షణీయంగా చేస్తుంది.

21) గండకి పత్రం: దీనిని అడవిముల్ల అని అంటారు. దీనిని సేవించడం వల్ల అతిమూత్ర వ్యాధి తగ్గుతుంది.



ఇదీ వినాయకచవితి ఏకవింశతి పూజలో దాగిన రహస్యం! మన ఋషీశ్వరులు చెప్పిన సనాతన హైందవ ధర్మ రహస్యాలను తెలుసుకుందాం! మన ఆచారాలను పాటిద్దాం! మన హైందవ సనాతన ధర్మాన్ని రక్షిద్దాం!



చౌదూరి నరసింహారావు–సాహిత్య, ఆధ్యాత్మిక విశ్లేషకులు

# బాలలను రంజింప చేసే కథల కుండ ' సరస్వతీ పుత్రుడు '

తెలుగు సాహిత్యంలో బాలసాహిత్యానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే బాల సాహిత్య కథలు వ్రాయాలంటే పిల్లల మనోభావాలు, మనస్తత్వాలు, అభిరుచులు మొదలైన అంశాలు తెలియాల్సిన అవసరం ఉంది. ఇవాళ బాల సాహిత్యం రాశిలోనే కాదు వాసిలో కూడా పెరిగింది. ఒకప్పుడు బాల సాహిత్యం రాసే వాళ్ళు చాలా అరుదుగా ఉండేవారు. ఈ రోజులలో పెద్దలే కాదు పిల్లలు కూడా బాల సాహిత్య ప్రక్రియలు రాయడంలో పోటీ పడుతుండడం గొప్ప పరిణామం. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలో ఆసక్తిగల ఉపాధ్యాయులు పిల్లలచే కథలు రాయించడంలో సఫలీకృతులు అవుతున్నారు. అయినప్పటికీ బాల సాహిత్యం అనుకున్నంత స్థాయిలో బాలల దరి చేరకపోవడం, బాలలకు దాపుగా నిలబడకపోవడం కొద్దిగా ఆలోచించాల్సిన విషయమే. చాలామంది బాలసాహిత్య రచయితలు కథలు రాసుకుంటూ వెళ్తున్నారు. పుస్తకాలు అచ్చు వేస్తున్నారు. కానీ తాము రాసిన కథలు గానీ, తాము ముద్రించే పుస్తకాలు గానీ విద్యార్థులకు చేరవేయడంలో కొంత గ్యాప్ కనిపిస్తుంది. మరికొందరు బాల సాహిత్య రచయితలు అయితే సన్మానాల కోసమో, అవార్డుల కోసమో రాస్తున్నట్టుగా కనిపిస్తుంది. మరికొందరు బాల సాహిత్యం మీద మక్కువతోటి నాణ్యమైన కథలు రాస్తూ విద్యార్థులకు చేరువ అయ్యేలాగా ప్రయత్నిం చేస్తుండడం గర్వకారణం. ఇట్లా విద్యార్థుల మీద ప్రేమతో కండ్ల ముందు కదలాడే సాంఘిక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని స్థానిక భాషలో పదాలను సులువుగా ఉపయోగిస్తూ పిల్లలను ఆకర్షించే విధంగా కథలు రాస్తున్న వారిలో హైదరాబాదులో నివాసం ఉంటున్న కందర్ప వెంకట సత్యనారాయణ మూర్తి ప్రముఖులలో ఒకరు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి ప్రాంతానికి చెందినవాడు అయినప్పటికీ, హైదరాబాదులోనే నివాసం ఉంటున్నాడు. భారత సైనిక మెడికల్ విభాగం, సివిల్ వైద్య రంగంలో సుమారు నలభై సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొంది కూకట్ పల్లిలో విశ్రాంత జీవితం గడుపుతున్న కందర్ప మూర్తి వయసు సుమారు ఎనబయి సంవత్సరాలు. వృద్ధాప్య వయసులో ఉన్న ఇతడు విద్యార్థులపై మమకారంతో , తెలుగు సాహిత్యం మీద ఉన్న అభిలాషతో సామాజిక కథలు,బాలసాహిత్య కథలు, హాస్య రచనలు, విశ్లేషణ వ్యాసాలు, కవితలు,గేయాలు సుమారు రెండువందలకు పైగా రాశారు. ఆయన ఇటీవల కాలంలో "సరస్వతి పుత్రుడు" అనే బాలల కథా సంపుటి పేరుతో బాలల కోసం 37 కథలతో ఈ పుస్తకాన్ని బాలల లోకానికి అందించడం జరిగింది.కందర్ప మూర్తి ఒక నిబద్ధత గల వ్యక్తి కాబట్టే అంత పెద్ద వయసులో ఉన్నప్పటికీ విశ్రాంతి తీసుకోవలసిన వయసులోకూడా ఎంతో తపనతో బాలల కోసం తన కథల ద్వారా ఒక సందేశం ఉండాలన్నది ఆయన దృఢమైన అభిప్రాయం. సరస్వతీ పుత్రుడు బాలల కథల పుస్తకం 99 పేజీలతో, 37 చిన్న కథలు ఉన్నాయి. అందమైన ముఖచిత్రంతో విద్యార్థులను బాగా ఆకర్షించే విధంగా ఉంది. ఈ పుస్తకాన్ని చూడగానే చదవాలనే జిజ్ఞాస, ఆసక్తి విద్యార్థుల్లో కలుగుతుంది. ఈ కథల సంపుటిలో మొదటి కథ 'సరస్వతీ పుత్రుడు". ఇందులో హై స్కూల్ లో అటెండర్ ఉద్యోగం చేస్తున్న సైదులు వినయ, విధేయ, క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. కేవలం అతి తక్కువ చదువు ఎనిమిదవ తరగతి వరకే చదివినప్పటికీ, ఆ ఊరిలో ఎందరినో పరోక్షంగా విద్యావంతులను చేసి సరస్వతీ పుత్రుడుగా పేరు తెచ్చుకున్న అటెండర్ సైదులు కథే ఇది. అంతిమంగా అటెండర్ సైదులు ఉద్యోగ విరమణ రోజున ఉపాధ్యాయ బృందంతో పాటు ఊరి పెద్దలంతా ప్రశంసలతో ముంచెత్తుతారు.ఊరి పెద్దలు ఏమి కావాలనో కోరుకోమని ప్రశ్నించగా మన ఊరికి ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయమని కోరడం సైదులు వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది. అదేవిధంగా "డబ్బుల చెట్టు "అనే కథలో సీతారామయ్య గారి మనవడు చాలా అమాయకుడు. ఎవరు ఏది చెబితే అది నమ్మేస్తాడు. ఎవరో చిన్నప్పుడు భూమిలో డబ్బులు పాతి పెడితే మొలుకలు వచ్చి చెట్లకు డబ్బులు కాస్తాయని చెప్పారని అందుకుగాను తన పెరట్లో ఎవరికి కనబడకుండా భూమిలో రూపాయి నాణెము పాతిపెట్టి రోజు నీళ్లు పోస్తాడు. యాదృచ్ఛికంగా భూమి నుండి ఒక చింత మొక్క పెరిగి పెద్దదై పువ్వులు, కాయలు కాస్తుంటే తొందరలోనే డబ్బులు వస్తాయని ఆశపడతాడు ఆ విద్యార్థి. చివరకు ఆ చెట్టు కాసిన చింతకాయలు అమ్మితే డబ్బులు వస్తాయని నీవు నిరాశ పడవద్దని తాత చెప్పిన హితోపదేశంతో కథ ముగుస్తుంది. కథ చదువుతున్నంత సేపు ఇంకా ఇంకా చదవాలనే ఆసక్తి విద్యార్థుల్లో కలిగే విధంగా కథ సాగుతుం ది. అలాగే మరొక కథ" తీనెటీగా కందిరీగ " కథలో పిల్ల కందిరీగకు తేనెటీగ చేసిన సహాయము ఎంతో ఉద్విగ్న భరితంగా ఉంటుంది. ఈ కథ చదివిన పిల్లలు ప్రకృతిలో ప్రతిది దేనికదే ప్రాధాన్యత కలిగి ఉంటుందని, ఒకరికొకరు సహాయ పడాలని అన్న సందేశం ఈ కథలో ఉంటుంది. ఒకరు సహాయ పడినప్పుడు ఎలా కృతజ్ఞత తెలుపాలో చిన్నపిల్లల మనసులలో హత్తుకునే విధంగా అర్థమయ్యే రీతిగా కథను సాగించడం కందర్ప మూర్తికే చెల్లుతుంది. " కళ్ళే కలమైతే" అనే మరో కథలో ఆత్మవిశ్వాసం ఉంటే ఎటువంటి అంగవైకల్యాన్నైనా అధిగమించవ చ్చునని నిరూపించిన 12 ఏళ్ల ఇంగ్లాండ్ కి చెందిన భయాన్ కథ ఉంటుంది. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఈ కథ సంపుటిలో మెరుగుపడితే బంగారమే, మానవసేవే మాధవసేవ, విహారయాత్రలో వినోదం, అమాయ కుడు కాదు ఆణిముత్యం, నేను స్కూలుకు వెళ్ళను, గాడిద చూపిన పరిష్కారం, తాతయ్య పాఠశాల చదువు ముచ్చట్లు, ఎవరి జీవితం వారిదే మొదలైన కథలు బాలలనే కాదు పెద్దలను కూడా మురిపించే విధంగా ఉంటాయి. ప్రతి కథలో పాఠకులు కొత్త విషయాన్ని తెలుసుకుంటారు. పెద్దల కోసం సాంఘిక కథలు చేయి తిరిగిన రచయిత కందర్ప మూర్తి కలం నుంచి జాలువారిన మూడవ బాలల కథల సంపుటి ఈ "సరస్వతీ పుత్రుడు ". బాలల చేతులలోకి వెళ్లిన ఈ పుస్తకం వారి యొక్క మనసులను రంజింప చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రతి పాఠశాల గ్రంథాలయంలో ఉండదగిన పుస్తకం ఇది. ఇందులోని కథలు చదవడం వల్ల విద్యార్థులలో స్నేహభావం, దయాగుణం, పట్టుదల, గౌరవం, పరోపకారం వంటి విలువలు తప్పకుండా పెరుగుతాయి. విద్యార్థుల భావి జీవితంలో "సరస్వతీ పుత్రుడు" పుస్తకం ఎంతో ఉపయో గపడగలదు. ఇటువంటి మంచి పుస్తకం రాసిన కందర్ప మూర్తి గారికి హృదయపూర్వక అభినందనలు. రాబోయే కాలంలో ఇంకా పుస్తకాలు రాయాలని నేను ఏమి సూచించను కానీ,నికార్సైన నిండు మనసు గల రచ యితను బాల సాహిత్య రంగంలో గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి – బాల సాహిత్య రచయిత**
**సెల్ : 9441561655**

# పురాణాల్లో గణపతి

గణపతి గురించి అనేక పురాణ గాథలు ఉన్నాయి. స్కంధ, వామన, పద్మ పురాణాలు, శివ రహస్యం, తైతరియోపనిషత్తు గణపతి గజముఖుడు గానే జన్మించినట్టు చెబుతున్నాయి. శివపురాణం, వరాహ పురాణం, వైవర్త పురాణాల్లో గణపతి పుట్టుకకు సంబంధించిన విచిత్రమైన గాథలు మనకు కనబడతాయి. గణపతికి ఎలుకే కాకుండా నెమిలి, సింహం, సర్పం కూడా వాహనాలు అని గణేశపరమైన ముద్గల పురాణం చెబుతోంది. వివిధ యుగాలలో గణపతి ఆవిర్భావ సమయాల్లో వివిధ పేర్లతో పూజలందుకున్నట్లు తెలుస్తోంది. వివిధ పురాణాలలో గణపతి పుట్టుకను గురించిన ప్రస్తావన ను గూర్చి ఇక్కడ తెలుసుకుందాం.

గజాననుడు..

వినాయకునికి గజముఖం ఏర్పడడం వెనుక గాథను బ్రహ్మవైవర్త పురాణం వివరించింది. ఆ పురాణ గాథ ప్రకారం శివపార్వతుల వివాహం తరువాత దేవతలకు ఒక అనుమానం వచ్చింది. శివపార్వతులకు పుత్రుడు కలిగితే తమ ప్రాబల్యం తగ్గిపోతుంది అనిపించింది. అందుకే వారి ఏకాంతానికి భంగం కలిగించాలనుకున్నారు. అలా శివపార్వతుల శృంగారానికి ఆటంకం కలగడంతో శివవీర్యం క్రిందపడి దాని నుంచి ఒక బాలుడు ఉద్భవించాడు. విచిత్రంగా శివుడు ఆ బాలుడిని చూడగానే అతడి శిరస్సు ముక్కలైపోయింది. అప్పుడు శివుడు ఉత్తర దిశగా తలపెట్టుకొని నిద్రిస్తున్న ఏనుగు తలను తెచ్చి ఆ బాలుని ముండానికి అతికిస్తాడు. ఆ విధంగా ఆ బాలుడు గజాననుడయ్యాడు. అతని భార్య పేరు పుష్టి అని తెలుస్తుంది.

మహాగణపతి..


గణపతి కృతయుగంలో అదితి కస్యపుల పుత్రునిగా అవతరించి, దేవాంతక నరాంతకులనే రాక్షసులను వధించాడు. త్రేతాయుగంలో మయూరేషునిగా జన్మించి బ్రహ్మ కుమార్తెలైన సిద్ధి, బుద్ధి లను వివాహం చేసుకోగా, క్షేముడు, లాభుడు అనే పుత్రులు కలిగారు. ద్వాపర యుగంలో గణపతి సింధూరాసురుడనే రాక్షసుడిని సంహరించాడు. "కలౌ చండీ వినాయకౌ" అనే సూత్రం ప్రకారం కలికల్మషనాశకుడైన గణపతి ఈయనే. గణపతిని మహాగణపతిగా అర్చిస్తారు. ఆ మహాగణపతి ఆవిర్భావ గాథ బ్రహ్మాండ పురాణంలో కనిపిస్తుంది. లలితా పరాభట్టారికా బండాసురునితో యుద్ధం చేస్తుంది. లలితా దేవికి అవరోధం కల్పించడానికి సర్వవిఘ్న యంత్రాన్ని నిర్మిస్తాడు రాక్షసుడు. అప్పుడామె కామేశ్వరుని వంక చూసి విఘ్ననాశకునిగా మహా గణేశుని కల్పిస్తుంది. ఆయన భండాసుడు నిర్మించిన విఘ్న యంత్రాన్ని భేదిస్తాడు. అలా లలితా పరాభట్టారికా అమ్మవారికి విజయం ప్రాప్తించడంలో మహాగణపతి పాత్ర ముఖ్య మైనదని తెలుస్తుంది.

సంకటహర గణేశుడు..

జీవితంలో సంకటాలను తొలగించి అభివృద్ధిని కలిగించే సంకటహర గణేశ స్తోత్రాలు మనకు ప్రధానంగా రెండు పురాణాల్లో కనిపిస్తాయి. నారద పురాణంలో నారదుడు చేసిన గణేశ స్తోత్రం మొదటిది. రెండోది వరాహ పురాణంలో కనిపిస్తుంది. గజాననుడు గణనాయకునిగా అభిశక్తుడైన భాద్రపద శుద్ధ చవితి నాడు ఇంద్రాది దేవతలు చేసిన స్తోత్రం రెండవది. ఈ పురాణంలో వినాయకుని పుట్టుకను గురించిన గాథ చిత్రమైనది. ఒకప్పుడు భూలోకవాసులైన ఋషులు, మునులు కైలాసానికి వెళ్లి పరమశివుని దర్శించి, తమ తపస్సులకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పి బాధపడ్డారు. వారి మాటలు విన్న శివుడు గణపతిని సృష్టించి, అతనికి సమస్త గణాలపై ఆదిపత్యం ఇచ్చాడు. ప్రథమ పూజను వరంగా ప్రసాదించాడు.

ఇతర పురాణాలలో....

పార్వతీదేవి పిండి బొమ్మకు ప్రాణం పోయడం, శివుడు శిరస్సు ఖండించడం, ఏనుగుతల అతికించడం, గణనాయకునిగా పట్టం కట్టడం వంటి అందరికీ తెలిసిన గాథలు శివపురాణం, స్కాంద పురాణాలలో



ప్రముఖంగా కనిపిస్తున్నాయి. బ్రహ్మాండ పురాణంలో లక్ష్మీదేవి చరిత్ర తో పాటు గణపతి ప్రస్తావనా ఉంటుంది. అన్ని పురాణాలు భాద్రపద శుద్ధ చవితిని విశేష తిథిగా పేర్కొంటున్నాయి. ఖగోళంలో ముంజేయి ఆకారంలో కనిపించే హస్తా నక్షత్రం గణపతి తొండంలా కనిపించే కారణం చేత వినాయక నక్షత్రంగా ప్రసిద్ధికెక్కింది. " విగతో నాయకః యస్య సః అని వ్యుత్పత్తి తనపై మరొకరి పెత్తనం లేని స్వతంత్ర దైవం వినాయకుడు. ఆయుష్షు, బుద్ధి, యశస్సు, కవిత్వం, ఐశ్వర్యం, భుక్తి, ముక్తి అన్నీ గణపతిని భక్తి తో ఆరాధిస్తే సమకూరుతాయి.

చౌదూరి నరసింహారావు

# వినాయక వ్రతం ఎప్పటిలోగా ఆచరించాలి? ఈ నవరాత్రులపై గ్రహణ ప్రభావమెంత?

ఊరూవాడా కొలువై ఉండ్రాళ్లు ఆరగించే బొజ్జ గణపయ్య.. మనలో ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపి మనల్ని ఆశీర్వదించేందుకు మండపాల్లోకి విచ్చేస్తున్నాడు. దేశమంతా ఎంతో వైభవంగా నిర్వహించే పండుగ వినాయక చవితి ఆగస్టు 27న జరగనుంది. సిద్ధి, బుద్ధి ప్రదాత అయిన విఘ్నేశ్వరుడి వ్రతం బుధవారం రావడం చాలా విశేషం. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట లోపు ఆచరించడం ఉత్తమం.

**నాయతి నాయయతీతి వ నాయకః విశేషేణ నాయకః వినాయకః**

పూర్వ జన్మ పాప పుణ్యాలకు సరిపడే తీరులో మనల్ని నడిపించేవాడు గణాధిపతి. అలాంటి గణేశుడిని వినాయక చవితిరోజు ఒక్కరోజు పూజించినా సకల పాపాలు నశించి, విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయి. భారతీయ సనాతన ధర్మంలో షోడశ కర్మలు (1. గర్భాదానంబీ 2. పుంసవనంబీ 3. సీమంతం –జననానంతర సంస్కారములు (పుట్టిన తరువాత)బీ 4. జాతకర్మబీ 5. నామకరణంబీ 6. నిష్క్రమణబీ 7. అన్నప్రాశనబీ 8.చూడాకరణబీ 9. కర్ణవేదబీ 10. అక్షరాభ్యాసంబీ 11. ఉపనయనంబీ 12. వేదారంభంబీ 13. కేశాంతబీ 14. సమావర్తనబీ 15. వివాహంబీ 16. అంత్యేష్టి) ఆచరించాలన్నాబీ శుభకార్యాలు, వ్రతాలు చేయాలన్నా విఘ్నేశ్వరుడి పూజలేకుండా ఆచరించ రాదని శాస్త్రం చెబుతోంది. పాప పుణ్యాలను తొలగించి మోక్షాన్ని ఇప్పించే గణపయ్యను వినాయక చవితి రోజున పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి.

**మట్టి విగ్రహాన్నే ఎందుకు పూజించాలి?..**

చెరువులు, నదుల వద్ద ఉన్న మట్టితో విఘ్నేశ్వరుడిని చేసి ఆ ప్రతిమను పూజించాలంటోంది శాస్త్రం. ఈ సృష్టి మొత్తం ఒకే పదార్థం నుంచి ఏర్పడింది (ఏకమై పరమై).. తిరిగి అదే పదార్థంలో లయమవుతుందనేది వేదమంత్రం చెప్పింది. ఏ మట్టి నుంచైతే విఘ్నేశ్వరుడు వినాయక రూపంలో ఆవిర్భవించి పూజలందుకున్నాడో, అదే మట్టిరూపం తిరిగి యథాస్థానంలో లయమవుతుంది. అనగా, ఈ సృష్టిలో ప్రతి ప్రాణీ ఏ భగవంతుడి వద్ద నుంచి వచ్చిందో తిరిగి అక్కడే లయం అవ్వాలి. ఈ మధ్యలో ధర్మ మార్గంలో నడుస్తూ భక్తి మార్గాన్ని పెంపొందించుకుంటూ జ్ఞానమార్గాన్ని వెతుక్కుంటూ మోక్షమార్గాన్ని సంపాదించి ఆ పరమాత్ముడిలో లయం కావాలనేటువంటి నిగూఢ రహస్యం ఈ వ్రతంలో దాగి ఉంది. అందువల్ల మట్టి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించాలి.

గ్రహణ ప్రభావం..

విఘ్నేశ్వరుడి వ్రతం అనంతరం గణేశ నవరాత్రులు ఆచరించడం శాస్త్రసమ్మతం. గణపయ్యకు పత్రి పూజ చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఆచారాలను బట్టి 1, 3, 5,7,9, 11,21 రోజుల పాటు పూజించడం ఆచారం.శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సెప్టెంబర్ 7న రాహుగ్రస్త చంద్ర గ్రహణం ఏర్పడనుండటంతో అంతకుముందే గణేశ్ నిమజ్జనం పూర్తి చేసుకోవడం ఉత్తమం.

**21 రకాల పత్రాలు ఇవే..**

విఘ్నేశ్వరుడికి అనేక రూపాలు ఉన్నాయి. పురాణాలు, ఆగమ శాస్త్రాల్లో గణపతికి 33 రూపాలు వర్ణించబడ్డాయి. ప్రతీ రూపానికీ ప్రత్యేక ఆరాధన, ఫలితాలను చెప్పారు. వినాయక చవితి రోజున సింహాసనంపై కూర్చొన్న నాలుగు లేదా ఆరు చేతులు కలిగిన గజముఖంతో ఉన్నటువంటి ముఖ్యంగా ఒక చేతిలో కుడుములు, మరో చేయి ఆశీర్వచనం ఇచ్చేలా ఉన్నటువంటి మట్టిగణపతిని పూజించడం శ్రేష్ఠం. వినాయక వ్రతంలో ఏకవింశతి పత్ర పూజ (21) ఎంతో ప్రాధాన్యమైనది. ఆ పత్రాలన్నీ ఔషధ గుణాలతో కూడినవి కావడంతో భాద్రపదమాసంలో ఇంట్లో పూజలు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు ఉండవని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.

**నిష్ఠగా నిమజ్జనం..**

వినాయక వ్రతం అనంతరం నిమజ్జనం ఎంతో కీలక ఘట్టం. విఘ్నేశ్వరుడిని ఎంత భక్తితో పూజిస్తామో, వినాయక నిమజ్జనాన్నీ అంతకంటే ఎక్కువ భక్తిశ్రద్ధలతో ఆచరించాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసే రోజు ఉపవాసం ఆచరించాలి. విఘ్నేశ్వరుడి నిమజ్జనం సముద్రం/నదులు/తటాకములు/ఇంట్లో లోతైన పాత్రల్లో గానీ భక్తి శ్రద్ధలతో, ఎలాంటి ఆడంబరాలకు పోకుండా చేయాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసేటప్పుడు కాళ్లకు చెప్పులు ధరించకూడదు. ఆరోగ్యం రీత్యా ఉపవాసం చేయలేనటువంటి వారు విఘ్నేశ్వరుడికి సమర్పించిన లేదా నివేదించిన ప్రసాదాలను మాత్రమే స్వీకరించాలి. నిష్ఠగా వినాయక వ్రతాన్ని ఆచరించిన వారికి స్వామివారి అనుగ్రహం లభిస్తుంది. వినాయక వ్రతాన్ని ఆచరించేటప్పుడు గణపతి కథలను వింటూ అక్షింతలను దగ్గర పెట్టుకోవాలి. వ్రతం పూర్తయ్యాక వాటిని తలపై వేసుకోవాలి. మరీ ముఖ్యంగా వినాయక వ్రత కథలలో శమంతకోపాఖ్యానం కచ్చితంగా పఠించడం ద్వారా అపనిందలు తొలగి శుభాలు కలుగుతాయి

# వరల్డ్ చాంపియన్‌షిప్‌లో సింధు శుభారంభం

పారిస్‌లో జరుగుతున్న వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు శుభారంభం చేసింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆమె తొలి రౌండ్‌లో విజయం సాధించింది. మంగళవారం జరిగిన ఉమెన్స్ సింగిల్స్ మ్యాచ్‌లో సింధు 23–21, 21–6 తేడాతో బల్గేరియాకు చెందని కలోయానా నల్బోంతోవాను మట్టికరిపించింది. అయితే, ఆరంభంలో సింధు తడబడింది. ప్రత్యర్థి దూకుడుగా ఆడటంతో ఒత్తిడికి లోనైంది. ఒక దశలో 12–7తో వెనుకడి గేమును కోల్పోయేలా కనిపించింది. కానీ, ఆ తర్వాత సింధు అద్భుతంగా పుంజుకుంది. వరుసగా ఐదు పాయింట్స్ నెగ్గి 12–12తో సమం చేసిన ఆమె ఆపై దూకుడు ప్రదర్శించి తొలి గేము సొంతం చేసుకుంది. ఇక, రెండో గేములో సింధు జోరుకు ఎదురులేకుండా పోయింది. 39 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి రెండో రౌండ్‌కు చేరుకుంది. రెండో రౌండ్‌లో థాయిలాండ్ షట్లర్ కరుపతేవన్ లెట్షానాతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ హెచ్.ఎస్ ప్రణయ్ కూడా శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో ఫిన్లాండ్‌కు చెందిన జోకిమ్ ఓల్డోర్ఫ్‌పై 18–21, 15–21 తేడాతో విజయం సాధించాడు. తొలి రౌండ్‌ను దాటడానికి ప్రణయ్ శ్రమించాల్సి వచ్చింది. 47 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ఫిన్లాండ్ ఆటగాడి నుంచి ప్రతిఘటన ఎదురైంది. అయినప్పటికీ ప్రణయ్ వెనుకడగు వేయలేదు. మరోవైపు, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్–రుత్విక శివాణి జంట రెండో రౌండ్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో భారత



జోడీ 18–21, 21–16, 21–18 తేడాతో మకావుకు చెందిన లియోంగ్ ఐయోక్ చోంగ్–వెంగ్ చి జంటపై గెలుపొందింది. అయితే, పురుషుల డబుల్స్‌లో నిరాశ తప్పలేదు. భారత జంట హరిహరన్–రుబాన్ కుమార్ 15–21, 5–21 తేడాతో లియు కువాంగ్ హెంగ్–యాంగ్ పొ హన్(చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడిపోయింది.

# హాకీ అభిమానులకు గుడ్ న్యూస్..
# ఆసియా కప్ మ్యాచ్‌లకు ఫ్రీ ఎంట్రీ

హాకీ ఫ్యాన్స్‌కు భారీ గుడ్ న్యూస్.. ఆసియా కప్ మ్యాచ్‌లను స్టేడియాల్లో ఉచితంగా చూడొచ్చు. అవును.. హాకీ ఇండియా అభిమానులకు బంఫర్ ఆఫర్ ఇచ్చింది. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిరి హాకీ స్టేడియంలో హాకీ ఆసియా కప్‌కు జరగనుంది. ఈ టోర్నీలోని అన్ని మ్యాచ్‌లను ఫ్రీగా చూడొచ్చని హాకీఇండియా మంగళవారం ప్రకటించింది. హాకీ ఇండియా ప్రెసిడెంట్ దిలీప్ టిర్కీ మాట్లాడు తూ.. 'రాజ్‌గిరిలో పురుషుల హాకీ ఆసియా కప్ నిర్వహించడం భారత హాకీకి చారిత్రాత్మకమైన ఘట్టం. ఇందులో ప్రతి అభిమానిని భాగస్వామ్యం చేయాలనుకున్నాం. ఉచిత ప్రవేశం ద్వారా క్రీడలను మరింత దగ్గరికి తీసుకురావడం, కుటుంబాలు, విద్యార్థులు, యువ అథ్లెట్లు ప్రపంచ స్థాయి హాకీని చూసేలా చేయడం మా లక్ష్యం. ఇది కేవలం టోర్నమెంటే కాదు. ఇది వేడుక.'అని తెలిపారు. ఉచిత టికెట్ కోసం హాకీ ఇండియా యాప్ లేదా %WWW. Ticketgenie.in%లో నమోదు చేసుకోవాలి. పూర్తయ్యాక వర్చువల్ టికెట్ లభిస్తుంది. ఆ వర్చువల్ టికెట్‌తో స్టేడియాల్లోకి ఎంట్రీ కావొచ్చు.



# బుమ్రా లేనప్పుడే బౌలింగ్ ఎందుకు బాగా చేస్తానంటే.. సీక్రెట్ బయటపెట్టిన సిరాజ్



ఇటీవల ఇంగ్లాండ్ గడ్డపై భారత స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సంచలన ప్రదర్శన చేశాడు. ఏకంగా 23 వికెట్లు తీసి సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ముఖ్యంగా బుమ్రా గైర్హాజరు అయిన రెండు, ఐదు టెస్టుల్లో భారత గెలవడంలో అతనిదే కీలక పాత్ర. ఆ మ్యాచ్‌ల్లో సిరాజ్ బౌలింగ్‌ను ఎంత పొగిడినా తక్కువే. బుమ్రా ఉన్నప్పుడు కంటే లేనప్పుడే సిరాజ్ బౌలింగ్ ప్రదర్శన మెరుగ్గా ఉంటుందని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతుంటుంది. దీనిపై తాజాగా స్వయంగా సిరాజే స్పందించాడు. 'బాధ్యతను మోసే అవకాశం వచ్చినప్పుడు సాధారణ సిరీస్‌లోనూ నా ప్రదర్శన పెరుగుతుంది. బాధ్యత నాకు భిన్నమైన సంతోషాన్ని ఇస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది.'అని చెప్పాడు. ఇంగ్లాండ్‌లో బుమ్రా గైర్హాజరులో భారత్‌పై విమర్శలు చేసిన వారి నోరు మూయించానని తెలిపాడు. 'ఎడ్జ్‌బస్టన్‌లో నా గురించి మాట్లాడుకున్నారు. నేను ఏం చేయగలనో నాకు తెలుసు. వారికి తెలియదు. వారు అతిగా మాట్లాడారు. అందుకు వారి నోళ్లు మూయించడానికి అదే సరైన సమయని భావించా. బుమ్రా వెన్ను గాయం కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అప్పుడు బౌలింగ్ దళంలో సానుకూల వాతావరణాన్ని కొనసాగించడానికి నా వంతు ప్రయత్నం చేస్తా. మనం దీన్ని సాధించగలమనే నమ్మకాన్ని నా సహచర ఆటగాళ్లలో కలిగించడానికి చూస్తా. మనం ఇప్పటికే సాధించిన వాటిని మళ్లీ చేసి చూపించవచ్చని చెబుతా.'అని సిరాజ్ చెప్పుకొచ్చాడు. మైదానంలో తన దూకుడుకు కారణం విరాట్ కోహ్లీనే అని సిరాజ్ తెలిపాడు. 'ఆర్సీబీలో కోహ్లీ తో కలిసి ఉన్నాను. అతనితో నాకు మంచి అనుబంధం ఉంది. ఆటలో పోరాట పటిమను కోహ్లీని చూసే నేర్చుకున్నా. మైదానంలో ప్రత్యర్థులను శత్రువుల్లా.. బయట స్నేహితుల్లా చూడాలనే అతని తీరు నాకు నచ్చింది. నేను దూకుడుగా లేకపోతే బౌలింగ్ బాగా చేయలేను. ఫాస్ట్ బౌలర్లు మైదానంలో దూకుడుగా ఉంటారు. కానీ, వారి కంటే కోహ్లీ దూకుడు ఎక్కువ.'అని సిరాజ్ తెలిపాడు.

# 'చికిత' దేశానికే గర్వకారణం..
# సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత విషెస్



కెనడాలో జరుగుతున్న ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం సీఎంవో ఆఫీస్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్చరీ అండర్ 21 కేటగిరీ ఫైనల్‌లో కొరియాకు చెందిన పార్క్ యెరిన్‌పై విజయం సాధించి స్వర్ణం చేజిక్కించుకుని చికిత వరల్డ్ చాంపియన్‌గా నిలవడం దేశానికే గర్వకారణమని సీఎం తెలిపారు. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, లక్ష్యాన్ని సాధించాలన్న చికిత సంకల్పం యువతీ యువకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆటుపోట్లను తట్టుకుంటూ గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆర్చరీలో రాణించిన చికిత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్షించారు. చిన్ననాటి నుంచి చికితలోని ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులకు సీఎం అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత క్రీడాకారిణి చికితకు మంగళవారం ఎక్స్ వేదికగా విషెస్ తెలిపారు. వరల్డ్ యూత్ ఆర్చరీ చాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్ సాధించి ప్రపంచ క్రీడా వేదికపై భారత దేశ ప్రతిష్టను, తెలంగాణ ఖ్యాతిని చాటిచెప్పిందని కవిత కొనియడారు. సుల్తాన్ పూర్ గ్రామం నుంచి ప్రపంచ స్థాయి పోటీల్లో దేశానికి మొట్టమొదటి బంగారు పతకాన్ని అందించిన చికిత ఎందరో ఆడబిడ్డలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. భవిష్యత్ లో చికిత మరెన్నో బంగారు పతకాలు సాధించి మనందరికీ గర్వకారణం గా నిలవాలని ఆకాంక్షించారు.

# టీ4 సిరీస్‌లో కొత్త ఫోన్ విడుదల చేసిన వీవో




ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ వీవో భారత మార్కెట్లో తన టీ–సిరీస్ కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఆరో ఫోన్‌గా తెచ్చిన వీవో టీ4 ప్రో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, 50 ఎంపీ కెమెరా, 6,500 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఆండ్రాయిడ్ 15 ఫన్‌టచ్ ఓఎస్15తో వచ్చే ఈ ఫోన్ 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ క్వాడ్ కర్వ్‌డ్ అమోల్డ్ డిస్‌పే, 120హెర్ట్జ్ రీఫ్రెష్ రేటు కలిగి ఉంది. ముఖ్యంగా నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్ ఇస్తామని కంపెనీ తెలిపింది. బ్లేజ్ గోల్డ్, నిట్రో బ్లూ కలర్స్‌లో ఈ ఫోన్ లభిస్తుంది. మూడు వేరియంట్లలో విడుదల చేసిన ఈ ఫోన్ ధరలు 8జీబీ, 128జీబీ రూ. 27,999, 8జీబీ, 256జీబీ రూ. 29,999, 12జీబీ, 256జీబీ వేరియంట్ రూ. 31,999గా నిర్ణయించింది. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంకు కార్డుల ద్వారా కస్టమర్లకు రూ. 3,000 వరకు డిస్కౌంట్ వర్తిస్తుంది. ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ. 3,000 వరకు తగ్గింపు పొందే వీలుంటుంది. ఈ నెల 29 నుంచి వీవో అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్, ఇతర స్టోర్లలో అమ్మకాలు మొదలవుతాయని కంపెనీ వెల్లడించింది.

# ద్విచక్ర వాహన విక్రయాలు పెరగొచ్చు.. ఇక్రా అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ద్విచక్ర వాహన విక్రయాలు 6%–%9% పెరగొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. స్థిరమైన రిప్లేస్‌మెంట్(పాత వాహనాన్ని మార్చి కొత్త వాహనాన్ని కొనుగోలు చేయడం), పట్టణ ప్రాంతాల్లో వినియోగ రికవరీ, సాధారణ వర్షపాతం నమోదుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు పెరగడం, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు తదితర అంశాలు అమ్మకాల వృద్ధికి తోడ్పడతాయని రేటింగ్ సంస్థ తెలిపింది. 'పరిశ్రమ అవుట్‌లుక్ ఇప్పట్టికి సానుకూల వైఖరి కలిగి ఉంది. స్థిరమైన డిమాండ్ ఉతమిస్తుంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అంశం వృద్ధి వేగవంతం కావడానికి అదనపు ప్రోత్సాహాన్నిస్తుంది' అని పేర్కొంది. పండుగ సీజన్‌కు ముందు ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మానుఫ్యాక్చరర్లు (ఓఈఎంలు) డీలర్లకు బలమైన పంపిణీ కారణంగా ఈ జూలైలో టూ వీలర్స్ హోల్‌సేల్ అమ్మకాలు 9% వృద్ధితో 15 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ఇదే జూలైలో రిటైల్ అమ్మకాలు 6.5% క్షీణించాయి. పట్టణ ప్రాంతంలో డిమాండ్ స్తబ్ధత, అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోళ్లు తగ్గడం ఇందుకు కారణమని పేర్కొంది. ఎగుమతుల వృద్ధి సైతం కొనసాగొచ్చని తెలిపింది. రాబోయే పండుగ సీజన్ నాటికి రిటైల్ డిమాండ్ పుంజుకోవచ్చని రేటింగ్ ఏజెన్సీ చెప్పుకొచ్చింది.

# మెరుగైన షాపింగ్ కోసం కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ తీసుకొచ్చిన ఎస్‌బిఐ కార్డ్, ఫ్లిప్‌కార్ట్

ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ కార్డ్, ప్రముఖ ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు ప్రకటించాయి. కస్టమర్ల షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ మరింత సౌకర్యంగా ఉండేందుకు, వివిధ ప్రయోజనాలు, రివార్డులు, అనేక ఫీచర్లతో కూడిన కో–బ్రాండెడ్ క్రెడిట్ కార్డును తీసుకొచ్చినట్టు వెల్లడించింది. మంగళవారం 'ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు'ను ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి, ఎండీ అశ్విని కుమార్ తివారీ సమక్షంలో ప్రారంభించారు. ఇరు సంస్థలు సంయుక్తంగా తీసుకొచ్చిన ఈ కార్డు ద్వారా వినియోగదారులకు క్యాష్‌బ్యాక్‌తో పాటు అనేక ప్రయోజనాలు లభిస్తాయని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ఈ కార్డును ఉపయోగించి కస్టమర్లు మింత్రాలో చేసే కొనుగోళ్లపై 7.5 శాతం క్యాష్‌బ్యాక్‌ను, ఫ్లిప్‌కర్ట్, షాప్సీ, క్లియర్‌టిప్‌లలో చేసే ఖర్చులపై 5 శాతం క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. జొమాటో, ఉబర్, నెట్‌మెడ్స్, పీవీఆర్‌లలో 4 శాతం క్యాష్‌బ్యాక్, అంతర్జాతీయ లావాదేవీల రుసుముపై 3.5 శాతం రాయితీ లభిస్తుంది. అంతేకాకుండా మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఫర్నీచర్, గృహోపకరణాలు,




ట్రావెల్ బుకింగ్‌లు సహా ఫ్లిప్‌కార్ట్‌లో లభించే అనేక ఉత్పత్తులు సేవలపై రాయితీలను పొందవచ్చని పేర్కొంది.

# జొమాటోకు రూ. 40 కోట్లకు పైగా పన్ను నోటీసులు




ప్రముఖ ఫుడ్ డెలివరీ సేవల సంస్థ జొమాటోకు జీఎస్టీ అథారిటీ భారీ మొత్తంలో పన్ను నోటీసులు జారీ చేసింది. ఇటీవలే జొమాటో తన బ్రాండింగ్‌ను ఎంటర్నల్ లిమిటెడ్‌కి మార్చిన సంగతి తెలిసిందే. దీంతో ఎటర్నల్ లిమిటెడ్ పేరుమీదే వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) విభాగం మూడు పన్ను నోటీసులు ఇచ్చింది. 2017, జూలై నుంచి 2020, మార్చి మధ్య కాలంలో కంపెనీ పన్ను చెల్లింపుల విషయంలో ఔట్‌పుట్ ట్యాక్‌ను తక్కువగా చెల్లించడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించి ఉల్లంఘనలకు పాల్పడినందుకు రూ. 40 కోట్లకు పైగా పన్ను డిమాండ్ చేస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ఎటర్నల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌కు తెలియజేసింది. బెంగళూరు జాయింట్ కమిషనర్ పేరుతో ఉత్తర్వులు ఇవ్వగా, మొత్తం పన్ను డిమాండ్‌లో రూ. 17.19 కోట్లు జీఎస్టీ, రూ. 21.42 కోట్లు వడ్డీ, రూ. 1.71 కోట్లు జరిమానా ఉన్నట్టు వివరించింది. అయితే, జీఎస్టీ అధికారులు ఇచ్చిన నోటీసులను తాము సవాలు చేస్తామని ఎటర్నల్ స్పష్టం చేసింది. న్యాయవాదుల అభిప్రాయం మేరకు అప్పీలుకు వెళ్తామని, తాము ఎలాంటి పన్ను ఉల్లంఘనలకు పాల్పడలేదని పేర్కొంది.

# ట్రంప్ టారిఫ్ ఆందోళనలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై అమెరికా అదనపు సుంకాలు బుధవారం నుంచి అమలు కానున్నాయి. ఇప్పటికే 25శాతం సుంకాలు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకాలు విధించగా.. బుధవారం (ఆగస్టు 27 నుంచి ) 50శాతానికి చేరనున్నాయి. ఈ క్రమంలో సుంకాల ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లు ఒకశాతానికిపైగా పడిపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,377.39 వద్ద నష్టాల్లో మొదలైంది. సుంకాల ఆందోళన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. చివరకు 849.37 పాయింట్ల నష్టంతో 80,786.54 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 255.70 పాయింట్లు తగ్గి 24,712.05 వద్ద స్థిరపడింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు తగ్గి 87.69 వద్ద ముగిసింది. మార్కెట్లు దాదాపు 1,167 షేర్లు లాభపడగా.. 2,751 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్ నష్టపోగా.. ఐషర్ మోటార్స్, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి, నెస్లే ఇండియా, ఐటీసీ లాభాల్లో ముగిశాయి.



ఎఫ్‌ఎంసీజీ మినహా మిగతా అన్నిరంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ, టెలికాం ఒకటి నుంచి రెండుశాతం వరకు తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.3శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం తగ్గాయి.

# మళ్లీ పెరిగిన బంగారం



దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. మంగళవారం దేశ రాజధానిలో 10 గ్రాముల పసిడి రూ. 600 పెరిగి రూ. 1,00,770కి చేరుకున్నాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, భారత కరెన్సీ రూపాయి విలువ బలహీనపడటం, అంతర్జాతీయ వాణిజ్య, భౌగోళిక పరిణామాలు ఇందుకు దోహదపడుతున్నాయి. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి రూ. లక్ష దాటగా, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం పది గ్రాములు రూ. 550 పెరిగి రూ. 1,02,130 వద్ద ఉంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్లు పది గ్రాములు రూ. 500 పెరిగి రూ. 93,550కు చేరుకుంది. మరోవైపు వెండి ధరలు కూడా రూ. 3,000 పెరగడంతో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ. 1,18,000(అన్ని పన్నులు కలిపి) చేరుకుందని సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫెడ్ గవర్నర్ లీసా కుక్‌ను తొలగించాలని తీసుకున్న నిర్ణయంతో సెంట్రల్ బ్యాంకు స్వతంత్రతపై ఆందోళనలు రేకెత్తాయి. దీంతో ఇన్వెస్టర్లు సాంప్రదాయ సురక్షితమైన ఆస్తి బంగారం వైపునకు మొగ్గ చూపారని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమొడిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ అన్నారు. ఫలితంగా గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ బంగారం 3,378.37 డాలర్లకు చేరింది. ఇక, దేశీయంగా భారతీయ ఉత్పత్తులపై ట్రంప్ ప్రకటించిన అదనపు 25 శాతం సుంకం బుధవారం అమలు కానుండటంతో రూపాయి మారకం 12 పైసలు క్షీణించి రూ. 87.68 వద్ద నిలిచింది.

# దూకుడుమీదున్న యాపిల్..

దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ భారత్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరిస్తోంది. ఐ–ఫోన్లు, ఇతర ఉత్పత్తులకు భారత్ బెస్ట్ మార్కెట్‌గా నిలిచిన నేపథ్యంలో ఇండియాలో తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. ఇక ఢిల్లీ, ముంబైలో రిటైల్ స్టోర్ల ను తెరిచిన సంస్థ.. మూడో స్టోర్‌ను బెంగళూరు లో ఓపెన్ చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 2వ తేదీన బెంగళూరులో తొలి రిటైల్ స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ గత వారం ప్రకటించింది. ఇప్పుడు భారత్‌లో నాలుగో రిటైల్ స్టోర్‌ను యాపిల్ తాజాగా ప్రకటించింది. పూణె లో కోరెగావ్ పార్క్ ప్రాంతంలో సెప్టెంబర్ 4న ప్రారంభించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోన్న యాపిల్ సంస్థ.. బెంగళూరులో భారీ ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ ప్రకారం.. బెంగళూరులో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్‌కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్ లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ. 6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ. 1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది.

# సినిమా..




## అఖండ 2 సినిమాపై హ్యూజ్ బజ్..!

నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న అఖండ 2 సినిమా అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేసుకున్నారు. టీజర్‌తోనే సినిమాపై హ్యూజ్ బజ్ ఏర్పడేలా చేశారు మేకర్స్. సినిమాలో బాలయ్య మాస్ విధ్వంసంతో రికార్డులచెడుగుడు ఆడేస్తాడని అంటున్నారు. సం యుక్త మీనన్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్న అఖండ 2కి మరోసారి థమన్ తన మాస్ డ్యూటీ చేస్తున్నాడట. అఖండ 2 సినిమాను దసరాకి రిలీజ్ ఫిక్స్ అనుకున్నా రు. కానీ సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేసే క్రమంలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఇంకాస్త బాగా చేయాలని ఆలోచిస్తున్నారట. అందుకే హర్రి బర్రి అన్నట్టు కాకుండా సినిమాను అనుకున్న విధంగా అవుట్ పుట్ వచ్చే వరకు చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలో అనుకున్న సెప్టెంబర్ 25 రిలీజ్ డేట్ కూడా మారే అవకాశాలు ఉన్నాయట. ఐతే అఫీషియల్ గా చిత్ర యూనిట్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయలేదు. ఐతే దసరా కి అదే సెప్టెంబర్ 25కి ఆల్రెడీ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు.

ఓజీ సినిమాను సుజిత్ డైరెక్ట్ చేస్తున్నాడు. దానయ్య డివివి భారీ బడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రీసెంట్ గా జరిగిన వీరమల్లు ఈవెంట్ లో కూడా ఓజీఓజీ అనే కేకలు వేశారు. అఖండ2 వస్తుందో లేదోఅన్నది తెలియ దు కానీ ఓజీ మాత్రం తప్పనిసరిగా సెప్టెంబర్ 25 వచ్చి తీరుతుంది. అఖండ 2 రిలీజ్ డేట్ పై కన్ ఫ్యూజన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. బోయపాటి శ్రీను ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ తో పనిచేస్తు న్నారని తెలుస్తుంది.


రిలీజ్ డేట్ముఖ్యం కాదుసినిమా ఆడియన్స్ ని అలరించేలా చేయడం ముఖ్యం. అందుకే అఖండ2 రిలీజ్ పై ఇంకా స్పష్టత తీసుకోలేదు. ఒకవేళ అఖండ 2 దసరా రేసు నుంచి తప్పుకుంటే మాత్రం పవర్ స్టార్ ఓజీకి కలిసి వచ్చినట్టే. ఐతే దసరాకి అఖండ 2 మిస్ అయితే తమిళ సినిమాలు ఏవైనా వచ్చే ఛాన్స్ ఉంది.

## మినీ స్కర్ట్‌లో అషు గ్లామర్ బ్లాస్ట్



టాలీవుడ్ గ్లామర్ వరల్డ్‌లో అడుగుపెట్టిన తర్వాత అషు రెడ్డి స్టైల్, స్వాగ్‌కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ షోలో తన ఉత్సాహభరితమైన బాడీ లాంగ్వేజ్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి నెట్టింట తెగ దూసుకుపోతోంది. షేర్ చేసిన ఫోటోషూట్‌లో అషు రెడ్డి రెడ్ కలర్ ఫ్లోరల్ టాప్, బ్లాక్ మినీ స్కర్ట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. ఈ లుక్‌లో ఆమె వేషధారణ మాత్రమే కాదు, హైహీల్స్, హెయిర్ ఫ్లిప్, ఎక్స్‌ప్రెషన్లు అన్నీ కలసి ఒక స్టైలిష్ స్టేట్మెంట్ లా మారాయి. “నా హీల్స్ నిన్ను ఎత్తుగా చేస్తాయని నాకు తెలుసు. అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్‌కి యూత్ నుంచి రెస్పాన్స్ జెట్ స్పీడ్‌లో వచ్చింది. వేలల్లో లైకులు, ఆకట్టుకునే కామెంట్లతో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూస్తే క్లాస్‌కు గ్లామర్ ఎలా జోడించాలో అషుతో నేర్చుకోవాలి అంటున్నారు నెటిజన్స్. ఇక అషు కెరీర్ విష యానికొస్తే, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీ, డబ్‌స్మాష్‌తో మొదలైన ప్రయాణం టీవీ నుంచి సినిమాల వరకు విస్తరించింది. బిగ్ బాస్‌సీజన్ 3 ఆమెకు మంచి గుర్తింపు తీసుకువ చ్చింది. ఆ షో ద్వారా ఆమె మాస్ ఆడియెన్స్‌లో తన ప్రత్యేకతను చూపించింది. ఆ తర్వాత కొన్ని స్పెషల్ షోలు, ఈవెంట్ హోస్టింగ్, గ్లామర్ ఫోటోషూట్లతో తనదైన గుర్తింపును క్రియేట్ చేసుకుంది. అషు రెడ్డి స్పష్టంగా తెలుసుకొని ప్రయాణిస్తున్న విషయమేమిటంటే గ్లామర్ ద్వారా క్రేజ్ తెచ్చుకుంటే దానిని మెయింటైన్ చేయడమే అసలైన ఆర్ట్. ఆమె ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ చూస్తేనే తెలుస్తుంది.. ప్రతీ ఫోటోలో ఓ థీమ్‌ఉంటుంది, ఒక ఫీల్ ఉంటుంది. ముఖ్యంగా స్టైలింగ్, మేకప్, పోజింగ్, డ్రెస్సింగ్ డిజైన్ అన్నిటిలోనూ ఎంతో కేర్ తీసుకుంటుంది. మొత్తానికి, అషు రెడ్డి ఈ తాజా గ్లామర్ ఫోటోషూ ట్‌తో మరోసారి తన స్థాయిని నిరూపించుకుంది.

## మీనాక్షి చౌదరి అందాల మాయ



గ్లామరస్ లుక్‌లు ఆమెకు కొత్తకాదు కానీ, ఈసారి మాత్రం మీనాక్షి చౌదరి చూపిన అటిట్యూడ్ చూస్తే ఏవరికైనా వావ్ అనిపించకమానదు. బ్లాక్ షైనీ డ్రెస్‌లో ఆమె చేసిన ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కాస్త బోల్డ్‌గా కనిపించిన మీనాక్షి స్టైలింగ్‌లోని ఫినిషింగ్, హేర్ డూ, మేకప్ అన్నీ కూడా పర్ఫెక్ట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఫ్రెంచ్ మ్యూజిక్‌కి స్టయిలిష్‌గా పోజులిచ్చిన ఈ ఫోటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. మెడ దగ్గర నుండి స్లీవ్‌కు లూప్ లా డిజైన్ చేసిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేకంగా చెప్పాల్సిన విషయం ఏంటంటే, ఆమె కళ్ల లుక్స్. కెమెరాకి ఆమె ఇచ్చిన లుక్స్‌లో కనిపించిన కాన్ఫిడెన్స్, ఫెమినిన్ గ్రేస్ అన్నీ కలిసి ఫోటో షూట్‌ను లెవెల్ మీదకు తీసుకెళ్లాయి. అందుకే ఈ ఫోటోలు ప్రస్తు తం వైరల్ అవుతున్నాయి. సినీ సెలబ్రిటీలు కూడా కామెంట్స్ చేస్తూ మీనాక్షికి ఫుల్ మార్కులు వేస్తున్నారు. కేవలం ఫోటోలు మాత్రమే కాదు, మీనాక్షి చౌదరి కెరీర్ కూడా ఇంప్రెసివ్‌గా కొనసా గుతోంది. మిస్ ఇండియా రన్నరప్‌గా గుర్తింపు పొందిన ఆమె, తన సినీ ప్రస్థానాన్ని ‘ఇచట వాహనములు నిలుపరాదు’ అనే చి త్రంతో ప్రారంభించారు. ఆ తరువాత ‘ఖిలాడి’, ‘హిట్ 2’, ‘గుం టూరు కారం’ వంటి సినిమాల్లో గ్లామరస్ పాత్రలతో ఆకట్టుకు న్నారు. ఆమెకి త్వరలో విడుదల కాబోయే సినిమాలు కూడా ఓ కీలకమైన మైలురాయిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నయన్ అతనికి ఇంప్రెస్..!

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో మెగా మూవీకి సైన్ చేసింది. మెగాస్టార్ చిరంజీవి 157 సినిమాలో చిరంజీవి సరసన నటిస్తుంది నయనతార. ఆల్రెడీ ఈ ఇద్దరు సైరా నరసింహారెడ్డి సినిమాలో కలిసి జత కట్టారు. ఆ తర్వాత మళ్లీ అనిల్ రావిపూడి సినిమాకు పనిచేస్తున్నారు. ఐతే పెళ్లి తర్వాత నయనతార చాలా సెలెక్టెడ్ గా సినిమాలు చేస్తుంది. ఇతర భాషల సినిమాలైతే మాక్సిమం కాదనేస్తుంది. కానీ చిరుతో సినిమా అది కూడా అనిల్ డైరెక్షన్ లో అనేసరికి ఆసక్తి చూపించింది. అనిల్ రావిపూడి సినిమా షూటింగ్ ఎంట్రీ తోనే నయనతార ఒక క్రేజీ వీడియోతో హాయ్ చెప్పింది. ఇక సినిమాలో ఆమె రోల్ కూడా క్రేజీగా ఉండబోతుందని తెలుస్తుంది. సినిమాలో చిరంజీవి పి.ఈ.టి మాస్టర్ గా కనిపిస్తాడట. నయన్ పాత్ర గురించి డీటైల్స్ బయటకు రాలేదు. ఐతే అనిల్ వర్కింగ్ స్టైల్ కి నయనతార ఫిదా అయ్యిందని టాక్. ఎందుకంటే అసలేమాత్రం మిస్ యూజ్ లేకుండా స్టార్ డేట్స్ ని వాడుతున్నాడట అనిల్ రావిపూడి. అందుకే నయనతారకి కూడా అతను బాగా నచ్చేశాడట. అనిల్ రావిపూడితో పనిచేసిన ఎవరైనా ఈ మాటే చెబుతారు. నయనతార తెలుగు సినిమా చేయాలనుకోవడమే షాకింగ్ థింగ్ అయితే.. సినిమా అనుకున్న విధంగా చక చకా కానివ్వడం చూసి ఆమె సర్ ప్రైజ్ అవుతుందట. స్టార్స్ ని డేట్స్ అడిగి.. దానికి ఒకటి రెండు రోజులు అదనంగా తీసుకునే డైరెక్టర్స్ ని చూశాం కానీ అనిల్ ఇచ్చిన స్టార్ డేట్స్ కి రెండు రోజుల ముందే షెడ్యూల్ పూర్తి చేస్తాడట. అందుకే అతని గురించి అందరు పాజిటివ్ గా చెప్పుకుంటున్నారు. నయనతార కూడా ఇంప్రెస్ అయ్యింది అంటే ఆమెను మళ్లీ మళ్లీ తన సినిమాల్లో తీసుకునే ఛాన్స్ ఉంటుంది.




## ట్రెడిషనల్ లుక్స్‌లో కృతి

లేటెస్ట్ గా కృతిశెట్టి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఫ్రెష్ బ్రీజ్‌లా కనిపిస్తున్నాయి. ప్యాషన్ ప్రపంచంలో తనదైన మార్క్ వేసుకుంటున్న కృతి, లైట్ బ్లూ కలర్ ట్రెడిషనల్ డ్రెస్‌లో సింప్లిసిటీకి సెన్సిబిలిటీని జోడించి, స్టన్నింగ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటోంది. ఆమె వేసుకున్న బ్యూటిఫుల్ జ్యువెలరీ, క్లోజ్ అప్ కెప్చర్స్ లో ఎక్స్‌ప్రెషన్స్‌ను ఎలివేట్ చేస్తూ, ఆమె నేచురల్ గ్లో, క్యూట్ స్టైల్ కి మిలియన్ డాలర్ అటిట్యూడ్ జతయ్యింది. ఫోటోలలో కృతి ఒకసారి మాయాజాలంలా చూస్తే, ఇంకోసారి మనసుకు హత్తుకునేలా స్టైలిస్తూ చూపించింది. ట్రెడిషనల్ దుస్తుల్లోనూ ఎంతగా స్టైలిష్ గా కనిపించొచ్చో, ప్రూవ్ చేసింది. కళ్లలో ఉన్న ఎమోషన్, ముఖంలో కనిపించే ఫ్రెష్‌నెస్ ఆమె ఫోటోలకు స్పెషల్ ఫీల్ తీసుకొచ్చింది. జువెలరీ, మేకప్, హెయిర్ స్టైల్ అన్నింటిలోనూ ఒక సాఫ్ట్ టచ్ కనిపిస్తోంది. ఫోటో గ్రఫీ, స్టైలింగ్ పరంగా కూడా ఆమె టీమ్ హైలెట్ అయింది. కృతిశెట్టి కెరీర్ విషయానికి వస్తే, ఆమె ‘ఉప్పెన’ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ‘శ్యామ్ సింగారాయ్’, ‘బంగార్రాజు’, ‘ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి’ లాంటి సినిమాల్లో నటించి, యూత్ ఆడియన్స్‌కు చేరువ అయింది. హిట్ ఆఫర్లతో పాటు, వరుసగా స్టార్ హీరోలతో కూడా అవకాశం అందుకుంటోంది. కానీ ఇటీవల వచ్చిన కొన్ని చిత్రాలు మిక్స్‌డ్ టాక్ రావడంతో,ఆమెకు హిట్ సినిమాఅవసరం అయినపరిస్థితి కనిపిస్తోం ది. ఇటీవలే మోడ్రన్ గ్లామర్ ఫోటోషూట్‌లు షేర్ చేస్తూ, యువతను, ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది కృతి. రొటీన్ స్టైలింగ్‌కు భిన్నంగా, ట్రెడిషనల్ వేర్‌లో కూడా తనదైన మార్క్ చూపిస్తోంది. ఫ్యాన్స్ కామెంట్స్‌లో ఆమె న్యాచురల్ బ్యూటీని, నవ్వును ప్రత్యేకంగా మెచ్చుకుంటున్నారు. ఇక అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో పాటు ఇలాంటి యునిక్ ఫోటోషూట్లతో కృతిశెట్టి తన మార్క్‌ను మరింత బలపర్చేందుకు ప్రయత్నిస్తోంది.



Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com